మహాత్మునికి జి20 అధినేతల నివాళి

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 42 | విజయవాడ, సోమవారం 11 సెప్టెంబర్ 2023 | 6+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Monday 11 September 2023 | Rs



నేటికి భారత్-పాక్ మ్యాచ్ వాయిదా

- భారత్ స్కోరు 147/2 నుంచి మ్యాచ్ కొనసాగింపు

క్రీడలు పేజీలో..



అధ్యక్ష బాధ్యతల అప్పగింతకు చిహ్నంగా న్యాయదండాన్ని (గావెల్)ను బ్రెజిల్ అధ్యక్షులు లులాకు అందజేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

బ్రెజిల్‌కు అధ్యక్ష బాధ్యత

- ముగిసిన జి20 సదస్సు
- ఐరాసను సంస్కరించాలన్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : జి20 శిఖరాగ్ర సమావేశాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రస్తుతం జి20 దేశాలకు అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న భారత్ తదుపరి అధ్యక్ష బాధ్యతలను బ్రెజిల్‌కు అప్పగించింది. కాగా సదస్సులో చర్చించిన అంశాల పురోగతిపై నవంబరు నెలాఖరులో వర్చువల్ సమావేశాలు నిర్వహించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిపాదించారు. రొటేషన్ పద్ధతిలో జి20 అధ్యక్షత బాధ్యతలు బదిలీ అవుతాయన్న సంగతి విదితమే. ఈ క్రమంలోనే ఈ ఏడాది డిసెంబరు 1 నుంచి జి20 దేశాలకు బ్రెజిల్ అధ్యక్షత వహించనుంది. జి20 శిఖరాగ్ర సదస్సు ముగింపు సందర్భంగా న్యాయదండాన్ని (గావెల్ - చిన్నసుత్తి)ని బ్రెజిల్ అధ్యక్షులు లులా డిసిల్వాకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందజేసి అధ్యక్షత బాధ్యతలు అప్పగించారు. ప్రపంచ ఐక్యత, సమృద్ధి కోసం అంకిత భావంతో, దార్శనికతతో బ్రెజిల్ నాయకత్వం వహించగలదన్న విశ్వాసం తమకుందని ఈ సందర్భంగా మోడీ పేర్కొన్నారు. తదుపరి జి20 అధ్యక్ష బాధ్యతలను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని విధాలుగా బ్రెజిల్‌కు భారత్ సహకారం అందిస్తుందని తెలిపారు. నవంబరు వరకే జి20 అధ్యక్షతను భారత్ నిర్వహిస్తుందని, అంటే ఇంకా రెండున్నర నెలలున్నాయని, సదస్సులో నిర్ణయించిన అంశాల పురోగతిపై వర్చ్యువల్‌గా సమీక్ష నిర్వహించాల్సి వుందని మోడీ ప్రతిపాదించారు. ఈ వర్చ్యువల్ సమావేశాలకు సభ్యదేశాలన్నీ హాజరవుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి చేకూరాలన్నదే భారత్ ఆకాంక్ష అని ఆయన పేర్కొన్నారు. సామాజిక భద్రత, ద్రవ్య, ఆర్థిక స్థిరత్వం వంటి వాటికి తోడు ఈ దఫా క్రిప్టో కరెన్సీ కొత్తగా అంశంగా తోడైందని మోడీ అన్నారు. క్రిప్టో కరెన్సీని నియంత్రించేందుకు అంతర్జాతీయ ప్రమాణాలు అవసరమని ఆయన చెప్పారు. జి20 శిఖరాగ్ర సదస్సు విజయవంతానికి సహకరించినందుకు 140 కోట్ల మంది భారతీయులకు ధన్యవాదాలు తెలిపారు.

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అవశ్యం : మోడీ

ఐక్యరాజ్యసమితి సహా అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలను తక్షణమే చేపట్టాల్సిన అవసరముందని ప్రధాని మోడీ అన్నారు. ప్రధానంగా ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్య మిగతా 5లో

చంద్రబాబుకు రిమాండ్

- 40 గంటల ఉత్కంఠ అనంతరం ఏసిబి కోర్టు తీర్పు
- రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలింపు
- నేడు రాష్ట్ర బంద్‌కు టిడిపి పిలుపు



విజయవాడ ఎసిబి కోర్టు నుంచి చంద్రబాబును రాజమహేంద్రవరం తీసుకువెళ్తున్న దృశ్యం

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడుకు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాము కేసులో ఎసిబి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆరు గంటల సుదీర్ఘ విచారణ అనంతరం ఆదివారం సాయంత్రం 6.50 గంటలకు న్యాయమూర్తి హిమబిందు తీర్పు వెలువరించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించారు. నంద్యాలలో శనివారం తెల్లవారుజామున చంద్రబాబును అరెస్టు చేస్తారని అర్ధరాత్రి సమయంలో వార్తలు వచ్చినప్పటి నుంచి మొదలైన ఉత్కంఠ ఆదివారం సాయంత్రం ఏడు గంటలకు వీడింది. రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో విజయవాడ కోర్టు నుంచి రాజమండ్రికి పటిష్ట భద్రత మధ్య చంద్రబాబును తరలించారు. రిమాండు వార్త తెలిసిన వెంటనే సోమవారం నాడు రాష్ట్ర బంద్ నిర్వహించాలని టిడిపి పిలుపునిచ్చింది. దీనికి జనసేన మద్దతు ప్రకటించింది. సిపిఐ సంఘీభావం తెలిపింది. శనివారంనాడు మొదలైన టిడిపి శ్రేణుల నిరసనలు ఆదివారం రాత్రి కూడా కొనసాగాయి. కోర్టు తీర్పు వెలువడ్డాక ఎకడికక్కడ రాస్తారోకోలు, ముఖ్యమంత్రి దిష్టిబొమ్మల దగ్ధం వంటివి జరిగాయి. మరోవైపు వైసిపి కార్యకర్తలు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ విధించినట్లు వార్తలు వచ్చినా డిజిపి కార్యాలయం తాము అటువంటి ఆదేశాలు ఇవ్వలేదని జిల్లా అధికారులు ఎక్కడికక్కడ నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. తీర్పు నేపథ్యంలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు.

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడు తరపున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించగా, ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. ఈ నెల 22వ తేదీ వరకూ జ్యుడీషియల్ రిమాండు విధించిన న్యాయమూర్తి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించాలని ఆదేశించడంతో అప్పటికే పోలీసులు రెండు కాన్వాయ్‌లను సిద్ధం చేసి ఉంచారు. తీర్పు ఇచ్చిన వెంటనే చంద్రబాబు తరుపు న్యాయవాదులు బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఆయనకు 73 సంవత్సరాలని, మధుమేహం, రక్తపోటుతో బాధపడుతున్నారని, అదుపులోకి తీసుకున్నప్పటి నుండి తీర్పు ఇచ్చే వరకూ సుమారు 36 గంటలపాటు నిద్ర కూడా లేదని, మాజీ ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి అలాగే కూర్చుండిపోయారని, ఆయన ఆరోగ్య పరిస్థితి రీత్యా బెయిల్ ఇవ్వాలని, లేదా హౌస్ అరెస్టుకు అవకాశం ఇవ్వాలని, ఎన్‌ఎస్‌జి భద్రతలో ఉన్న నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించాలని న్యాయమూర్తిని కోరారు. సాధ్యంకాని పక్షంలో జైలులో సౌకర్యాలు ఉండే గది కేటాయించాలనీ మరో పిటీషన్ దాఖలు చేశారు. తీర్పు అనంతరం కోర్టుకు చేరుకున్న చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి కంటతడి పెట్టుకున్నారు. కోర్టులోనే లోకేష్ కూడా మిగతా 5లో

జైల్లో ప్రత్యేక వసతులు

తన ఆరోగ్య పరిస్థితుల రీత్యా ప్రత్యేక గది కేటాయించాలని, ఇంటి వద్ద నుంచి ఆహారం, మందులు తెచ్చుకునేలా అవకాశం ఇవ్వాలని, ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలని చంద్రబాబు వేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి అంగీకరించారు. ఆ మేరకు ఆదేశాలిచ్చారు.

విద్యుత్ కాంట్రాక్ట్ ఉద్యోగులను
రెగ్యులర్ చేయాలి

మహా ధర్నాలో స్ట్రగుల్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో కాంట్రాక్ట్ కార్మికులందరికి రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనంగా ఇవ్వాలని ఎపి విద్యుత్ ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో అదివారం నాడు ధర్నా చౌక్‌లో మహాధర్నా నిర్వహించారు. విద్యుత్ సంస్థల్లోని కాంట్రాక్ట్ కార్మికులందరికి నేరుగా వేతనాలు ఇచ్చి రెగ్యులర్ చేయాలని, వేతన ఒప్పందాన్ని పున:సమీక్షించాలని, పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేయాలని ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని, నూతన అపరేటర్లకు వేతన వ్యత్యాసాన్ని సరిచేయాలని, పీస్‌రేట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఇచ్చిన హామీ నేటికి అమలు కాలేదని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును వర్తింపచేయకుండా, 2022 పిఆర్‌సి అమలు చెయ్యకుండా 2018 పిఆర్‌సి ప్రకారం వేతనాలు పెంచడం సరైందికాదన్నారు. వీరందరికి రెగ్యులరైజేషన్ పై వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



మహాధర్నాలో మాట్లాడుతున్న కె బాలకాశి

నూతన షిఫ్ట్ అపరేటర్స్ వేతన నిర్ణయం అసమంజసంగా ఉందని, వీరందరికి పాత అపరేటర్ల మాదరిగానే వేతనాలు ఇవ్వాలన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు విద్యుత్ సంస్థ ఉద్యోగులా! లేక సచివాలయం ఉద్యోగులా! అనేది ప్రభుత్వం తేల్చాలని, పీస్ రేట్ కార్మికులైన మీటర్ రీడర్స్ , బిల్ కలెక్షన్, స్టోర్ హామీలుకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలవారీ వేతనాలు ఇవ్వాలని స్ట్రగుల్ కమిటీ డిమాండ్ చేసింది. విద్యుత్ వేతన ఒప్పందం పున:సమీక్షించాలని పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేసి ఇపిఎఫ్ నుంచి జిపిఎఫ్‌కు మార్చాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలలో కారుణ్య నియామకాలు చేపట్టాలని, పర్మినెంట్ , కాంట్రాక్ట్, కార్మికుల అన్ని సమ్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఎపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ నాయకులు కె బాలకాశి, పి.సుదర్శన్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, శివయ్య, కట్టా నాగరాజు, చంద్రశేఖర్, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి

- బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకునేది ఎర్రజెండానే
- తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వార్షికోత్సవ సభలో బృందా కరత్

తిరోగమన దిశగా విశ్వ విద్యాలయాలు

- ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను

గుంటూరు టు గుజరాత్


- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం

లోపలి పేజీలో..

ఆరోగ్య హక్కు చట్టం చేయాలి

- జెవివి రాష్ట్ర మహాసభ డిమాండ్
- అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ గేయానంద్, కె రామారావు

ప్రజాశక్తి- చీరాల (బాపట్ల జిల్లా)



డాక్టర్ ఎం గేయానంద్



కె రామారావు



బి రాజశేఖర్ రాహుల్

ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఆరోగ్య హక్కు చట్టం చేయాలని జన విజ్ఞాన వేదిక (జెవివి) రాష్ట్ర మహాసభ డిమాండ్ చేసింది. గ్రంథాలయాల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని, కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. బాపట్ల జిల్లా చీరాలలోని పద్మశాలి కల్యాణ మండపంలో నరేంద్ర దబోల్కర్ ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర 17వ మహాసభ ఆదివారం ముగిసింది. 25 జిల్లాల నుండి 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. 74 మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ ఎం.గేయానంద్, ప్రధాన కార్యదర్శిగా కుర్రా రామారావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ గోపాళం శివన్నారాయణ, డాక్టర్ చెలికాని స్టాలిన్, రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా బి.రాజశేఖర్ రాహుల్ ఎన్నికయారు.

శాస్త్రీయ దృక్పథమే చోదక శక్తి : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

శాస్త్రీయ దృక్పథమే చోదక శక్తి అని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. సైన్స్ ప్రయోగ ఫలితాలను సైతం విశ్వాసాలకు ముడిపెట్టి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే దుర్మార్గమైన పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలు రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. మహాసభలో ఆయన మాట్లాడుతూ ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేస్తూ, వ్యక్తి ఆలోచనల చుట్టూ అధికారాన్ని తిప్పుకుంటూ వ్యవస్థలను మిగతా 2లో



పాల్తేరు గ్రామంలో ఎండిపోతున్న వరి నారు మడిని పరిశీలిస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

కరువు సహాయక చర్యలు చేపట్టాలి

- ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు
- కరువు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి- యంత్రాంగం

కరువు ఛాయలు, తీవ్ర వర్షాభావం నెలకొన్న ప్రాంతాల్లో ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులను పరిశీలించారు. కరువు సహాయక చర్యలు చేపట్టాలని, రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాల్తేరులో ఎండిపోతున్న వరి నారు మడులను రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. 24 మండలాల్లో తీవ్ర కరువు దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ ఖరీఫ్ సీజన్లో 1,34,000 ఎకరాల్లో వారి సాగు చేయాల్సి ఉండగా, నేటికి 60 వేల ఎకరాల్లోనే వరి నాట్లు వేశారని, అవి కూడా ఎండిపోతున్నాయని తెలిపారు. కర్నూలు జిల్లా దేవనకొండ మండలంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్ర బేతపల్లి, చెల్లెల చెలిమల, బంటుపల్లి, గుడిమిరాళ్ల మీదుగా గుండ్లకొండకు చేరింది. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టులో వర్షాలు కురవక ఖరీఫ్ పంటలు దెబ్బతిన్నాయన్నారు. హంద్రీనీవా ద్వారా మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా, పాలకుల బాధ్యత రాహిత్యంతో పిల్ల కాలువల నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నందున లక్ష్యం నెరవేరడం లేదన్నారు.



'ఇండియా' ఫోరం గెలుపుతోనే
దేశానికి రక్షణ

- తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : ప్రతిపక్షాల ఐక్య వేదిక 'ఇండియా' ఫోరం వచ్చే 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలిస్తేనే దేశాన్ని రక్షించుకోగలమని తమిళనాడు ముఖ్యమంత్రి, డిఎంకె అధ్యక్షులు ఎంకె స్టాలిన్ తెలిపారు. నెవైలీలోని పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. 2024 ఎన్నికల్లో తమిళనాడు, పుదుచ్చేరిలోని మొత్తం 40 పార్లమెంట్ స్థానాలను డిఎంకె పార్టీ గెలుచుకోవాల్సిన ఆవశ్యకతను స్టాలిన్ తన ప్రసంగంలో వివరించారు. 'మనం ఆ స్థాయిలో ఘన విజయం సాధిస్తేనే.. తదుపరి అధికారంలోకి వచ్చే కేంద్ర ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించగలం' అని స్టాలిన్ తెలిపారు. మొత్తం 40 స్థానాల్లోనూ డిఎంకె విజయం సాధించాలని పార్టీ కార్యకర్తలకు స్టాలిన్ పిలుపునిచ్చారు.

అంతులేని విషాదం

- ఎటుచూసినా శవాల దిబ్బలే
- మొరాకోలో 2 వేలు దాటిన భూకంప మృతుల సంఖ్య



మరకేశ్ సమీపంలోని ఒక గ్రామంలో సర్వం కోల్పోయి రోదిస్తున్న భూకంప బాధితులు

మరకేష్: ఉత్తర ఆఫ్రికా దేశమైన మొరాకోలో పెను భూకంపం అంతులేని విషాదాన్ని మిగిల్చింది. పర్యాటక ప్రాంతమైన మరకేశ్ - సఫి ప్రాంతంలో ఎటుచూసినా శవాలే కనిపిస్తున్నాయి. భవన శిథిలాలను తొలగించే కొలదీ మృతదేహాలు వెలుగుచూస్తున్నాయి. ఆదివారం నాటికి మరణాల సంఖ్య 2 వేలు దాటింది. శిథిలాలను పూర్తిస్థాయిలో తొలగించాల్సివున్నందున మరణాల సంఖ్య ఇంకా పెరిగేవీలుందని సంబంధిత అధికారులు తెలిపారు. తీవ్రంగా గాయపడి ప్రాణాలతో బయటపడిన ప్రజలు ఒకవైపు ఒంటి నుండి రక్తమోడుతూనేవున్నా తమ వారి ఆచూకీ కోసం ఎదురుచూస్తున్న దృశ్యాలు కలిచివేస్తున్నాయి. నిద్రహారాలు మాని బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. దేశమంతటా విషాద ఛాయలు అలుముకున్నాయి. పర్యాటక ప్రాంతమైన మరకేశ్‌కు 70 కిలోమీటర్ల దూరంలోని అట్లాస్ పర్వత ప్రాంతంలో శుక్రవారం రాత్రి 6.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. భూకంపం ధాటికి భారీ సంఖ్యలో భవనాలు నేలమట్టమయ్యాయి. దీంతో ఇప్పటివరకు 2012 మంది మరణించారు. మరో 2,059 మంది గాయపడ్డారు. వీరిలో 1404 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులతో నిండిపోయిన ఆసుపత్రుల వద్ద మృత్యువుతో పోరాడి అసువులు బాసిన వారి మృతదేహాలను పదుల సంఖ్యలో తరలిస్తుండటంతో అక్కడి పరిసరాల్లో బంధువుల రోధనలు మిన్నంటాయి. దేశంలో గత ఆరు దశాబ్దాల్లో సంభవించిన అతిపెద్ద విపత్తు ఇదేనని అధికారులు తెలిపారు. మరకేష్-సఫి ప్రాంతంలో ప్రాణ, ఆస్తి నష్టాలు అధికంగా ఉన్నాయి. భూకంప దాటికి దాదాపు 3 లక్షల మంది ప్రభావితులైనట్లు ఐక్యరాజ్యసమితి అనుబంధ ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకటించింది. మరోవైపు రెండు రోజుల గడిచినా శిథిలాల కింది చిక్కుకుపోయినవారిని రక్షించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అయితే రహదారులపై వాహనాలు మిగతా 5లో

రాజకీయ కక్ష సాధింపు

సిదార్థ లూథ్రా వాదనలు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు నాయుడు అరెస్టు విషయంలో సిఐడి, పోలీసులు నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారని ప్రముఖ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదించారు. బాబును అరెస్టు చేసిన సమయంలో ఎఫ్ఐఆర్‌లో పేరు లేదని, అరెస్టు తరువాత ఎఫ్ఐఆర్ ఇస్తామన్నారనీ, 24 గంటలు గడిచిన తర్వాత కూడా ఎఫ్ఐఆర్ కాపీ ఇవ్వలేదని తెలిపారు. శనివారం ఉదయం సిఐడి చీఫ్ ప్రెస్‌మీట్ పెట్టి సాయంత్రానికల్లా చంద్రబాబును కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారని, అలా చేయలేదని న్యాయమూర్తికి వివరించారు. 24 గంటల సమయం ముగిసిన తరువాత కోర్టులో ప్రవేశపెట్టారని వివరించారు. ఆయన వయసు, ఆరోగ్యం దృష్ట్యా 30 గంటలపాటు నిద్ర లేకుండా చేయడం సామాన్య విషయం కాదని, తన క్లయింటు అతికష్టం మీద ఆదివారం ఉదయం ఆరు గంటలకు కోర్టుకు చేరుకున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధిగా చేసిన నిర్ణయానికి మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసే సమయంలో గవర్నర్ అనుమతి కూడా తీసుకోలేదని ప్రస్తావించారు. చంద్రబాబు అరెస్టు పూర్తిగా రాజకీయ ప్రేరేపిత చర్యని, ప్రభుత్వం ఆయనను లక్ష్యంగా చేసుకుందని తెలిపారు. ఇదే కేసుపై గతంలో హైకోర్టు విచారణ పూర్తి చేసిందని, తీర్పు రిజర్వు చేశారనీ, కేసులో ఉన్న వారందరూ బెయిల్‌పై ఉన్నారని కోర్టుకు చెప్పారు. శనివారం ఉదయం ఆరుగంటలకు నంద్యాలలో తన క్లయింట్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సిఐడి అధికారులు సంతకాలు తీసుకున్నారని పేర్కొన్నారు. అక్కడే కోర్టులో ప్రవేశపెట్టే అవకాశం ఉన్నా... కేవలం వారు అనుకున్న విధంగా చేయాలని తొమ్మిది గంటలపాటు ప్రయాణం చేయించి.... ఆరు గంటలకుపైగా విచారణ పేరుతో కూర్చోబెట్టి వేధింపులకు గురిచేశారని చెప్పారు. సెక్షన్ 409 చంద్రబాబుకు వర్తించదని, ఈ కేసులో ఎ35 ముద్దాయి భాస్కర ప్రసాద్‌ను అరెస్టు చేసినందున చంద్రబాబును అరెస్టు చేయాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. బాబు లండన్ వెళ్లిపోతున్నారని సిఐడి అధికారులు చెబుతున్నారని, అటువంటి ఆలోచన లేదని కోర్టుకు వివరించారు. సిఐడి అధికారులు ఏమాత్రం చట్టాలను గౌరవించడం లేదని తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల సమయంలో తన క్లయింటు ఉన్న బస్సును పోలీసులు చుట్టుముట్టారని, అప్పటి నుంచి ఆయన ఎక్కడకూ వెళ్లకుండా నిర్బంధించారని తెలిపారు. ఉదయం ఆరు గంటలకు అరెస్టు చేశామని వారే చెప్పారని, అంటే చంద్రబాబు వ్యక్తిగత హక్కులకు పూర్తి భంగం కలిగించారని చెప్పారు. ఆయనను అప్పటి నుండే అరెస్టు చేసినట్లుగా పరిగణించాలని కోర్టును కోరారు. సిఐడి అధికారుల 48 గంటల కాల్‌డేటా కోర్టుకు సమర్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును కోరారు. అనుబంధ పిటిషన్ అయినందున అంతవరకే వాదనలు పరిమితం చేయాలని కోరారు.

రెండు సార్లు వాయిదా

విచారణ మూడుసార్లు వాయిదా పడింది. తొలుత న్యాయవాదులు ఎక్కువమంది కోర్టు హాల్లోకి వెళ్లిపోవడంతో న్యాయమూర్తి అసహనం వ్యక్తం చేశారు. ప్రాసిక్యూషన్ తరుపున 15 మందికి, చంద్రబాబు తరుపున ఐదుగురికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. విచారణ కొనసాగిన అనంతరం మధ్యాహ్నం లంచ్‌కు మరోసారి వాయిదా వేశారు. మధ్యాహ్నం విచారణ తరువాత మరోసారి వాయిదా వేశారు. సాయంత్రం 6.50 గంటలకు తీర్పు వెలువరించారు. ఉదయం ఎనిమిది గంటలకు మొదలైన విచారణ సాయంత్రం 7.20 గంటలకు తీర్పుతో ముగిసింది. వెనువెంటనే చంద్రబాబు తరపున బెయిల్, హౌస్ అరెస్టు పిటీషన్లు, సిఐడి తరపున కస్టడీ పిటీషన్లను విచారణ అనంతరం రాత్రి తొమ్మిది గంటలకు తిరస్కరించారు. కస్టడీ పిటీషన్‌పై సోమవరం నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


అంతా చంద్రబాబు కనుసన్నల్లోనే

ఎఎజి పొన్నవోలు సుధాకర్‌రెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాము మొత్తం చంద్రబాబుకు తెలిసే జరిగిందని ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించిన ఎఎజి పొన్నవోలు సుధాకరరెడ్డి తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే అర్హతలేని కంపెనీకి అవకాశం కల్పించి క్యాబినెట్ తీర్మానాలను పక్కనబెట్టి మరీ ఈ వ్యవహారం నడిపారని న్యాయమూర్తి ముందు వాదనలు వినిపించారు. దీనివల్ల ప్రభుత్వానికి రూ.371 కోట్ల నష్టం వాటిల్లిందని, దీనికి సంబంధించిన అన్ని వివరాలూ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. దీనికి సంబంధించిన నోట్‌ఫైల్స్‌నూ ధ్వంసం చేశారని తెలిపారు. ప్రభుత్వానికి సంబంధించిన ఆస్తులకు నష్టం కలిగించి స్వలాభం కోసం చూశారని, అన్ని ఆధారాలూ ఉన్న తరువాతే అధికారులు కస్టడీలోకి తీసుకున్నారని వివరించారు. సిఐడి పోలీసులు వేధించారని చెప్పడంలో వాస్తవం లేదని, 24 గంటల్లోనే చంద్రబాబును కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. ఈ కేసులో ప్రథమ ముద్దాయి చంద్రబాబేనని పేర్కొన్నారు. విచారణలో అనేక విషయాలను అధికారులు గుర్తించారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో నిబంధనలేవీ పాటించలేదని, తెలంగాణకు చెందిన ఇల్లెందు రమేష్ ద్వారా చంద్రబాబును కలిసిన డిజిటెక్ కంపెనీ ప్రతినిధి సంజయ్ ఈ ప్రాజెక్టును రూపొందించారని తెలిపింది. స్కిల్ ప్రాజెక్టుపై ఇల్లెందు రమేష్ ఇచ్చిన లేఖను చంద్రబాబు ఉన్నత విద్యాశాఖకు పంపారని పేర్కొన్నారు. 2014 ఆగస్ట్ 22న సచివాలయంలో చంద్రబాబును డిజిటెక్ ప్రతినిధి సంజయ్‌దాగా, ఇల్లెందు రమేష్ కలిసి ప్రాజెక్టు గురించి చర్చించినట్లు తెలిపారు. ఆ తర్వాత 2014 సెప్టెంబర్ 20న కేబినెట్ అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారని న్యాయమూర్తికి వివరించారు. ఎపి బిజినెస్ రూల్స్ ప్రకారం తప్పనిసరిగా కేబినెట్ అనుమతి తీసుకోవాల్సి ఉన్నా, ఆ అనుమతి లేకుండానే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారని కోర్టుకు తెలిపారు. చంద్రబాబు మార్గదర్శకత్వంలో డిజిటెక్, సీమెన్స్‌తో కుమ్మక్కై నిధుల స్వాహాకు పథకం వేశారని పేర్కొన్నారు. 2014 అక్టోబరు 20న తమ మనిషి జె వెంకటేశ్వర్లును స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ఆడిటర్‌గా నియమించారని వివరించారు. కేబినెట్ సమావేశానికి ఒకరోజు ముందుగా ప్రతిపాదన పెట్టి 2015 ఫిబ్రవరి 16న ఆగమేఘాల మీద ఆమోదించుకున్నారని వివరించారు. వాస్తవాలను నిర్ధారించుకోకుండా, ప్రాజెక్ట్ కాస్ట్ ఎస్టిమేషన్ లేకుండా, థర్డ్ పార్టీ ఎవల్యూషన్ లేకుండానే కేబినెట్ ఆమోదం పొందడం వెనుక చంద్రబాబు కీలకంగా వ్యవహరించారని కోర్టుకు తెలిపారు. గంటా సుబ్బారావు సిఫార్సుతో రూ.370 కోట్లు విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని, ఇక్కడే అవినీతి ఉందని వివరించారు.

చట్టానికి ఎవరూ అతీతులు కారు

- చంద్రబాబుపై ఇంకా ఐదారు కేసులున్నాయి : విజయసాయిరెడ్డి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

చట్టానికి ఎవరూ అతీతులు కారని చంద్రబాబుపై కోర్టు ఇచ్చిన తీర్పు నిదర్శనమని వైసిపి ఎంపి, ఆ పార్టీ సీనియర్ నేత విజయసాయిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఒంగోలులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు తన పాలనలో చట్టాన్ని అతిక్రమించి ఎన్ని తప్పులు చేసినా తప్పించుకోవచ్చనే దృఢ అభిప్రాయంలో ఉన్నారన్నారు. ప్రజల సొమ్మును దోచుకోవడంపై ఆధారాలతో సహా కేసు పెట్టినందుకే ఆయన తప్పించుకునే పరిస్థితి లేదని చెప్పారు. చంద్రబాబు చేసిన అక్రమాలపై మరో ఐదారు కేసులున్నాయని తెలిపారు. జ్యుడీషియల్ రిమాండే కాకుండా పోలీసు రిమాండ్ కూడా ఉంటుందన్నారు. ఆయనపై కేసులు పెట్టడంలో రాజకీయ ఉద్దేశాలు ఏమీ లేవని చెప్పారు. ఆయనతో పాటు ఈనాడు అధినేత చెరుకూరి రామోజీరావు కూడా ఉన్నారని, ప్రస్తుతం సుప్రీంకోర్టు వరకూ వెళ్లి తాత్కాలికంగా తప్పించుకున్నారని, ఆయనపైనా కేసులుంటాయని అన్నారు.

లబ్ధి చేకూరినట్టు నిరూపిస్తే పీక కోసుకుంటా : అచ్చెన్న

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)



స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబుకుగాని, తన కుటుంబానికిగానీ పైసా లబ్ధి చేకూరినట్టు నిరూపిస్తే పీక కోసుకుంటానని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. కక్ష సాధింపునకే చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని, రాష్ట్రంలో చట్టం, ధర్మానికి విలువ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్కిల్ డవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును కావాలనే ఇరికించారని విమర్శించారు. దారుణాతిదారుణంగా వ్యవహరించి సిబిఐ అధికారులు కస్టడీకి తీసుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు వల్ల ఎంతో మంది శిక్షణ పొందారని నాడు సిఐడినే చెప్పిందన్నారు. ప్రస్తుతం ఊహాజనితమైన అంశాలపై ఆధారపడి పెట్టిన అక్రమ కేసు పెట్టారని ఆరోపించారు. చంద్రబాబును విచారణ పేరుతో రెండ్రోజులుగా నిద్ర కూడా లేకుండా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ఈ కేసులో రిమాండ్ రిపోర్టు అంతా ఓ కట్టు కథని విమర్శించారు. రెండేళ్ల క్రితం నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో తన పేరుగాని, చంద్రబాబు పేరుగాని లేవని, ఇప్పటికే ఈ కేసు విషయంలో పలువురు అరెస్టయి జైలుకు వెళ్లారని తెలిపారు. అటువంటిది ఇప్పుడు తమపై కేసులు పెట్టడం దురుద్దేశంతో కూడినదేనని ఆరోపించారు.

జగన్ సైకో చర్య

చంద్రబాబు అక్రమ అరెస్టు జగన్ సైకో చర్య అని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. అరెస్టు దుర్మార్గమని ఆదివారం మీడియాకు విడుదల చేసిన వీడియోలో తెలిపారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్యవాదులపై జగన్ దాడి చేస్తున్నారని పేర్కొన్నారు.

రిమాండ్ న్యాయ ప్రక్రియలో భాగమే

- అన్ని అక్రమాలపై విచారణ జరిపిస్తాం : సజ్జల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 2014 నుంచి 19 వరకూ అధికారంలో వున్నప్పుడు చంద్రబాబు అవినీతి అక్రమాలు ఒక్కోటి వెలుగులోకి వస్తున్నాయని, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ప్రజాధనాన్ని కొల్లగొట్టిన కేసులో 14 రోజుల రిమాండ్ న్యాయ ప్రక్రియలో భాగమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. చేసిన తప్పునకు తలదించుకోవాల్సింది పోయి ప్రజలను రెచ్చగొట్టేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని అన్నారు. అరెస్ట్ అయ్యాక వయసు రీత్యా హెలికాప్టర్‌లో తరలించేందుకు ప్రయత్నిస్తే ప్రచారం కోసం రోడ్డు వెంటే పోదామని పట్టుబట్టారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో కర్త కర్మ క్రియ చంద్రబాబేనని, ఈ అంశాన్ని కోర్టు పరిగణలోకి తీసుకోవడం వల్లే రిమాండ్ వచ్చిందని అన్నారు. పెద్దఎత్తున అవినీతి జరిగిన ఇరిగేషన్ ప్రాజెక్టులతోసహా చంద్రబాబు అక్రమాలన్నింటిపై విచారణ చేస్తామని తెలిపారు. న్యాయ ప్రక్రియను గౌరవించకుండా నారా లోకేష్, పవన్ కల్యాణ్ రెచ్చగొట్టే శాంతి భద్రతలకు విఘాతం కలిగేలా మాట్లాడుతున్నారని అన్నారు. వాళ్లకంటే తమపార్టీకే ప్రజల్లో ఎక్కువ పలుకుబడి వుందనే అంశాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పు చేస్తే ఎంతటి పెద్ద వారికైనా న్యాయపరమైన శిక్షలు తప్పవని తెలిపారు.

చివరికి న్యాయమే గెలుస్తుంది : మంత్రి మేరుగ నాగార్జున

ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని చంద్రబాబు రిమాండ్‌తో నిరూపితమైందని మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు అవినీతిపరుడు అని, రాష్ట్రంలో ఎన్నో అకృత్యాలకు పాల్పడ్డాడని రాష్ట్ర ప్రజానీకం గమనించాలని చెప్పారు.

బాబు అరెస్టుపై నిరసనాగ్రహం

- రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజూ టిడిపి ఆందోళనలు
- కొనసాగిన ప్రభుత్వ నిర్బంధం



కోనసీమ జిల్లా పి.గన్నవరంలో శిరోముండనం చేయించుకుంటున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనందసాగర్

ప్రజాశక్తి- యంత్రాంగం

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టుపై రెండో రోజూ నిరసనాగ్రహం పెల్లుబికింది. ఆయన అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా టిడిపి నాయకులు వివిధ రూపాల్లో ఆందోళనలు, దీక్షలు చేపట్టారు. నలుపు వస్త్రాలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పలు జిల్లాల్లో టిడిపి ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను, మాజీ ఎమ్మెల్యేలను, టిడిపి నేతలను పోలీసులు గృహనిర్బంధంలోనే ఉంచారు. టిడిపి నాయకుల దీక్షలను భగ్నం చేశారు. ర్యాలీలను అడ్డుకున్నారు. పలువురిని అరెస్టు చేశారు. శ్రీసత్యసాయి జిల్లా లేపాక్షి మండలం మైదుగోళంలో టిడిపి అభిమాని మంజునాథ్ రెడ్డి సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు ఆయనను వారించి కిందకు దించారు. ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెంలో ఎన్‌టిఆర్ సేవా సమితి అధ్యక్షుడు చావా సతీష్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి సర్దుమణిగింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద సాగర్ తదితరులు శిరోముండనం చేయించుకుని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రకాశం, విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో పోలీసులు టిడిపి నాయకుల దీక్షలను భగ్నం చేసి పలువురిని అరెస్టు చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీకి 149 నోటీసు జారీ చేశారు. జిల్లా తుళ్లూరు మండలం రాజధాని గ్రామాల్లో రైతులు, మహిళలు సామూహిక దీక్ష చేపట్టారు. మందడంలో రోడ్డుపై నిల్చుని నిరసన తెలిపారు. నెల్లూరులో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలను వారి ఇళ్ల వద్ద పోలీసులు నోటీసులు అందజేసి గృహ నిర్బంధం చేశారు. గుంటూరులో ఎంపి గల్లా జయదేవ్,దీక్ష చేపట్టారు.

చంద్రబాబు అరెస్ట్ రాజకీయ కక్షసాధింపు

పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించే ఎటువంటి చర్యలనైనా తమ పార్టీ ప్రతిఘటిస్తుందని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ తెలిపారు. వైసిపి పాలనలో రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా? అనే సందేహం కలుగుతోందని పేర్కొన్నారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవస్థల దుర్వినియోగం, ప్రజాపక్షం వహించే వారి గొంతు నొక్కే చర్యలను ఖండించాలని పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు రాజకీయకక్ష సాధింపు చర్య అని అన్నారు. నంద్యాలలో చంద్రబాబును అరెస్ట్ చేసిన తీరుని సమావేశం గర్హిస్తోందన్నారు. హైదరాబాద్ నుంచి తాను విమానంలో మంగళగిరి రావాలని నిర్ణయించుకోగా, అందుకు అడ్డుపడి విమానం గన్నవరంలో దిగడానికి అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన తీరు ఆమోదయోగ్యం కాదన్నారు. ప్రత్యామ్నాయంగా రోడ్డు మార్గాన వస్తున్న సమయంలోనూ రాష్ట్ర సరిహద్దు వద్ద ప్రభుత్వం నిలువరించేందుకు ప్రయత్నించడాన్ని పార్టీ సమావేశం ఖండించింది.

టిడిపి బంద్‌కు జనసేన మద్దతు

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఈనెల 11న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు జనసేన పార్టీ సంఘీభావం ప్రకటిస్తుందని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

లోకేష్‌కు సంఘీభావం

జగన్ నియంత పాలనపై కలిసి పోరాడదామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు పవన్ కల్యాణ్ తెలిపారు. ఆయన లోకేష్‌కు ఫోన్ చేసి, ధైర్యంగా ఉండాలని చెప్పారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి

- అబద్ధాలు.. వక్రీకరణలతో కేంద్రంలో పాలన
- బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకునేది ఎర్రజెండానే
- తెలంగాణ రైతాంగ సాయుధపోరాట వార్షికోత్సవ సభలో బృందా కరత్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో



భారీ ర్యాలీలో బృందా కరత్ తదితరులు

కేంద్రంలోని ప్రభుత్వం ప్రజలకు చెప్పేదొకటి.. చేసేది మరొకటి అని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ విమర్శించారు. పూర్తి అబద్ధాలు, వక్రీకరణలు, విద్వేష ప్రసంగాలతో వారు దేశాన్ని పాలిస్తున్నారన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం పార్కు వద్ద ఆదివారం సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 'తెలంగాణ సాయుధ పోరాట (2946-51) వార్షికోత్సవాలు, తెలంగాణ విలీన దినోత్సవాలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిటీ కార్యదర్శి ఎమ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బృందా కరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులమతాలతో సంబంధం లేకుండా, భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జరిగిన చారిత్రక తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను కూడా ముస్లిం రాజుపై హిందువులు చేసిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం దారుణమన్నారు. బిజెపి దాని అనుబంధ సంఘాలు, ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టి, విభజన రాజకీయాలు చేస్తున్నారని, ఢిల్లీలో జరుగుతున్న జి-20 అంతర్జాతీయ సదస్సులో 'విద్వేషాలు వద్దు' అనే తీర్మానాన్ని ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశపెట్టి, ఆమోదించుకున్నారని ఎద్దేవా చేశారు. చెప్పే మాటకు, చేసే పనికి సంబంధమే ఉండదని అన్నారు. బ్రిటీషర్లకు సలాం కొట్టిన ఆర్‌ఎస్ఎస్, సంఘపరివార్ శక్తులు ఇప్పుడు తెలంగాణ విమోచన దినం జరుపుతామని బయల్దేరాయని ఎద్దేవా చేశారు. అనేక త్యాగాలతో కులమతాలకు అతీతంగా ఐక్యంగా జరిగిన పోరాట చరిత్రను మత ఘర్షణలుగా చిత్రీకరిస్తూ ఆర్‌ఎస్ఎస్, బిజెపి దాని అనుబంధ సంస్థలు ప్రచారం చేస్తున్నాయని, అలాంటి చర్యల్ని సహించబోమని హెచ్చరించారు. కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం వంటి నేతల ఆదర్శాలు, స్ఫూర్తితో... మతోన్మాద శక్తులు, ప్రజాకంటక ప్రభుత్వాల బుల్డోజర్ రాజకీయాలను అడ్డుకుంటామని, ఎర్రజెండా ఎప్పుడూ పేదల పక్షానే నిలుస్తోందని స్పష్టం చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య మాట్లాడుతూ తెలంగాణ విమోచన దినంలో పాల్గొనేందుకు అమిత్ షా, రాహుల్ గాంధీలకు ఉన్న అర్హత ఏంటని ప్రశ్నించారు.

తెలంగాణ ప్రజలకు ద్రోహం చేసిన వారే సెప్టెంబర్ 17న హైదరాబాద్ వచ్చి వేడుకలు నిర్వహిస్తామని చెప్తున్నారని, ఇంతకంటే సిగ్గుచేటు ఇంకేముందని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, టి జ్యోతి, సీనియర్ నాయకులు ఎస్ మల్లారెడ్డి, రఘుపాల్, పిఎస్ఎన్ మూర్తి, నంద్యాల నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు వీరనారి చిట్యాల ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో సాయుధ పోరాట చరిత్రను తెలుపుతూ ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. బహిరంగ సభ అనంతరం సుందరయ్య పార్కు నుంచి చిక్కడపల్లి మీదుగా ఆర్‌టిసి క్రాస్‌రోడ్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఉన్నత న్యాయస్థానాల్లో పోరాడతాం

- టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్ర

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రబాబు రిమాండ్‌పై ఉన్నత న్యాయస్థానాల్లో పోరాటం చేస్తామని టిడిపి నేత ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం రాత్రి విలేకరులతో మాట్లాడారు. నారా లోకేష్ నేతృత్వంలో న్యాయపోరాటం చేసి ధర్మాన్ని గెలిపిస్తామని చెప్పారు. అప్పటి వరకు కార్యకర్తలు మనోధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. సమర్ధవంతంగానే న్యాయస్థానంలో వాదనలు వినిపించామని, సాంకేతిక అంశాలతో తిరస్కరించినట్లు భావిస్తున్నామని తెలిపారు. ఆదివారం ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని పేర్కొన్నారు. చంద్రబాబుపై జరుగుతున్న కుట్రలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని కోరారు. కేసుల్ని ఎదుర్కొనే క్రమంలో జగన్ రొమ్ము విరిచి నిలబడ్డారని సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. కోడికత్తి కేసు విచారణలో జగన్ ఎందుకు రొమ్ము విరిచి నిలబడలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. న్యాయస్థానాలను మేనేజ్ చేయడంలో జగనే దిట్ట అని, తన కేసుల విచారణలో కోర్టుల్ని మేనేజ్ చేసి అనుకూలంగా తీర్పులు తెచ్చుకున్నారని విమర్శించారు. ఇడి, సిబిఐ కేసులు, సొంత బాబాయి హత్యకేసులపై జగన్ ఎందుకు రొమ్ము విరిచి నిలబడలేదో సజ్జల చెప్పాలని డిమాండ్ చేశారు. విచారణకు హాజరుకాకుండా రకరకాల కారణాలతో పిటిషన్లు వేస్తూ ఎందుకు తప్పించుకుంటున్నారని ప్రశ్నించారు.

చంద్రబాబును అన్యాయంగా అరెస్టు చేశారని, దీనిని ఖండిస్తున్నామని తెలంగాణ టిడిపి ఉపాధ్యక్షురాలు నందమూరి సుహాసిని హైదరాబాద్ టిడిపి కార్యాలయంలో మీడియాతో చెప్పారు. కార్యకర్తలు ఓర్పు, సంయమనం పాటించాలని కోరారు.



మహిళలకు రూ.1.10 కోట్ల రుణాలు చెక్కు పంపిణీ చేస్తున్న మల్లాది విష్ణు

నాలుగేళ్లలో రూ.680 కోట్ల రుణాలు : మల్లాది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ ద్వారా వైసిపి నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా పలు పథకాల ద్వారా రూ.680 కోట్లు రుణాలు అందించామని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు తెలిపారు. టిడిపి హయాంలో రూ.280 కోట్లు మాత్రమే రుణాలిచ్చారని చెప్పారు. విజయవాడ గాయత్రీ కన్వెన్షన్ హాలులో ఆదివారం ఎపి బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆధ్వర్యాన నిర్వహించిన రుణమేళా, అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎపి కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా వివిధ రంగాల్లో పనిచేస్తున్న పలువురికి రుణాలివ్వడంలో సరళంగా వ్యవహరిస్తూ అత్యధికంగా రుణాలిస్తూ సొసైటీ పురోగతి అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. విజయవాడ కో - ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ పరిధిలో రూ.8 కోట్ల మేర రుణాలివ్వడాన్ని అభినందిస్తున్నట్లు చెప్పారు. ఎపి బ్రాహ్మణ కో - ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సిఇఓ నాగసాయి మాట్లాడుతూ రుణమేళా సందర్భంగా ఈ ఒక్కరోజే 60మంది సభ్యులకు రూ.1.10 కోట్లు రుణాలందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సీనియర్ మేనేజరు గొర్తి శ్రీనివాస్, దమ్మాలపాటి చంద్రశేఖర్, విజయవాడ 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణి మూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలి : యుటిఎఫ్

- యుటిఎఫ్ ప్రాంతీయ సదస్సుల్లో వక్తలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం/అనంతపురం కలెక్టరేట్



రాజమహేంద్రవరంలో మాట్లాడుతున్న కెఎస్ఎస్.ప్రసాద్

రాష్ట్ర ప్రభుత్వం బోధనేతర పనుల పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేసి విద్యాబోధన సక్రమంగా చేయడం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నక్కా వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్ విమర్శించారు. ఉపాధ్యాయులను బోధనకే వినియోగించాలి డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వర్క్‌షాపు అనంతపురం, తూర్పుగోదావరి జిల్లాల్లో ఆదివారం జరిగాయి. అనంతపురంలో జరిగిన సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలు వినియోగించుకుంటూ విద్యార్థులకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. పాఠశాల బోధనా సమయంలో సెల్ ఫోన్లను వాడటం నిషేధించారని, అయినప్పటికీ బోధనా సమయంలో ఎదో ఒక సమాచారం పంపమని చెప్పడంలో అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఉపాధ్యాయుల తప్పులు దొరుకుతాయనే పద్ధతిలో అధికారుల పర్యవేక్షణ ఉండటం సరికాదన్నారు. పర్యవేక్షణ అంటే ఉపాధ్యాయులను శిక్షించడం అనే విధంగా అర్థం మార్చివేశారని విమర్శించారు. వివిధ పోరాటాల సందర్భంగా ఉపాధ్యాయులపై బనాయించిన కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేంద్ర, ఎన్ దేవేంద్రమ్మ, ఎన్ శాంతి ప్రియ తదితరులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం సుమారు 5700 పేజీలతో నూతన పాఠ్య పుస్తకాలు, వర్క్ పుస్తకాలు సరిదిద్దే పనిని ఉపాధ్యాయులకు ప్రభుత్వం కేటాయించి, తీవ్ర మానసిక ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యాసంస్కరణల వల్ల 14 వేల పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయని తెలిపారు. విద్యారంగ ప్రభుత్వ అధికారులే ప్రభుత్వ పాఠశాలలను, విద్యారంగాన్ని తూలనాడడం దేనికి సంకేతమో ప్రభుత్వమే చెప్పాలని అన్నారు. పర్యవేక్షణ పేరుతో ఉపాధ్యాయులను కించపరుస్తున్న పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఆరోగ్య హక్కు చట్టం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నాశనం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటోందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములు చేయడం ప్రస్తుతం చారిత్రక అవసరమని వివరించారు. రాష్ట్రంలో అనేక సహజ వనరులున్నప్పటికీ పాలకుల అభివృద్ధి నిరోధక విధానాల వల్ల అవి రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడడం లేదని తెలిపారు. విభజన హామీల అమలుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం కనిపిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజానీకాన్ని చైతన్యపర్చాలని సూచించారు. జెవివి రాష్ట్ర నాయకులు జి మురళీధర్, ఎస్ఎన్ రమేష్, కె త్రిమూర్తులు, రిటైర్డు ప్రొఫెసర్ బోయా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయండి !

• సమగ్ర శిక్షా అభియాన్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల వేడుకోలు దీక్ష

ప్రజాశక్తి - యంత్రాంగం

తమను పర్మినెంట్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్షా అభియాన్, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు పలు జిల్లాల్లో ఆదివారం వేడుకోలు దీక్ష నిర్వహించారు. ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ల ఎదుట ఈ కార్యక్రమం చేపట్టారు. మూడు నెల బకాయి జీతాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ మాకు వర్తింపజేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని నినాదాలు చేశారు. వారి ఆందోళనకు యుటిఎఫ్, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద దీక్షలో ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, సిఐటియు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గురువులు మాట్లాడుతూ జీఓ 40ని విడుదల చేసినా మినిమం టైమ్‌స్కేల్ అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పుల్లో భాగంగా అన్ని విభాగాల ఉద్యోగులను రేషనలైజేషన్ పేరుతో కుదించి ఉన్న ఉద్యోగాలను తొలగించే ప్రయత్నాలు చేయడం దారుణమన్నారు. రోజుకొక కొత్త యాప్ తీసుకొచ్చి పని ఒత్తిడి పెంచిన ప్రభుత్వం జీతాలు మాత్రం సకాలంలో చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీక్షకు యుటిఎఫ్ విజయనగరం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఎస్ ఈశ్వరరావు, ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు జి.అప్పలనాయుడు మద్దతు తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద దీక్షలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. జెఎసి అధ్యక్షులు కె.విజయ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, శ్రీ సత్య సాయి జిల్లా అధ్యక్షులు జయచంద్రా రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షులు భూతన్న తదితరులు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరంలో నిరసన దీక్ష చేపట్టారు. తొలుత సిఐటియు కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా ప్రకాశం చౌక్‌కు ర్యాలీగా చేరుకున్నారు. ఏలూరులోని కలెక్టరేట్ వద్ద ఆర్ట్, క్రాఫ్ట్, పిఇటి రాష్ట్ర అధ్యక్షులు వాసా శ్రీనివాసరావు అధ్యక్షతన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మన ప్రభుత్వం వస్తుంది.. మీ అందరి సమస్యలు తీరుస్తుంది' అని గత ఎన్నికల ముందు ప్రజాసంకల్ప పాదయాత్రలో జగన్ చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లయినా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. కర్నూలు కలెక్టరేట్ వద్ద నిర్వహించిన దీక్షకు సిఐటియు జిల్లా కార్యదర్శులు పి.నిర్మల, జి.నాగేశ్వరరావు మద్దతు తెలిపి మాట్లాడారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ స్టేడియం వద్ద నిర్వహించిన దీక్షకు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, పిఆర్‌టియు నేత గోపీనాథ్ సంఘీభావం తెలిపారు. అల్లూరి సీతారామరాజు పాడేరులో ఐటిడిఎ వద్ద, పార్వతీపురం మన్యం జిల్లాలో కలెక్టరేట్ల వద్ద వేడుకోలు దీక్ష నిర్వహించారు.



విజయనగరం కలెక్టరేట్ వద్ద వేడుకోలు దీక్షలో పాల్గొన్న ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు, సిఐటియు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.గురువులు, కార్మికులు, ఉద్యోగులు

సిఐడి కాదది.. జెపిఎస్

• నేడు విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం : రామకృష్ణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసింది సిఐడి కాదని, జగన్ ప్రయివేట్ సైన్యం (జెపిఎస్) అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. పిచ్చి పరాకాష్టకు చేరినపుడే ఇలాంటి దుశ్చర్యకు పాల్పడతారని దుయ్యబట్టారు. సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో రాజకీయ పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. తిరుపతి బైరాగిపట్టెడలోని కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సాక్షాత్తు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, జడ్ ప్లస్ భద్రత కలిగిన వ్యక్తిని అదుపులోకి తీసుకోవడం రాష్ట్ర విచారణ సంస్థగా ఉండాల్సిన సిఐడి పోలీసు విభాగం పూర్తిగా జగన్ జెపిఎస్‌గా మారిందా? అనే అనుమానం వస్తోందన్నారు. రాష్ట్రంలో సాగుతున్న నియంత పాలనా పోకడలు, ప్రజాకంటక విధానాలపై మరింత ఉధృతంగా పోరాటాలు చేసేందుకు సమాయత్తం అవుతున్నామన్నారు. చంద్రబాబును కలిసి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న మరో ప్రజా నేత పవన్ కల్యాణ్‌ను పోలీసులు పైశాచికంగా అడ్డుకోవడం దుర్మార్గం అన్నారు. ఈ మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర నేతలు హరినాథ్‌రెడ్డి, రామానాయుడు, జిల్లా కార్యదర్శి పి మురళి, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకున్న డాక్టర్ చంద్రశేఖర్, తులసి ధర్మచరణ్

వేదా సీడ్స్‌కు ఉత్తమ కంపెనీ అవార్డు

ప్రజాశక్తి-గుంటూరు

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేద సీడ్స్ ఉత్తమ సీడ్ కంపెనీగా సీడ్స్‌మెన్ అసోసియేషన్ అవార్డు అందజేసింది. విజయవాడలోని ఓ ప్రయివేటు హోటల్లో ఆదివారం సీడ్స్‌మెన్ అసోసియేషన్ అవార్డ్స్-2023 కార్యక్రమం జరిగింది. ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం మాజీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి నుండి వేదా సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ ఈ అవార్డును అందుకున్నారు. సీడ్ ఎంటర్ ప్రెన్యూర్ విభాగంలో ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వేద సీడ్స్ ద్వారా నాణ్యమైన, అధిక దిగుబడులను అందించే హైబ్రిడ్ విత్తనాలను రైతులకు అందించటమే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వేద సీడ్స్ ప్రతినిధులు తులసి విశ్వంభర్, జనరల్ మేనేజర్ గుడి సతీష్‌కుమార్, హెచ్‌ఆర్ మేనేజర్ తోట రంగారావు, జిఎం తాయి శ్రీనివాసరావు, పిఆర్ఓ ఇక్కుర్తి వెంకటేష్, గాజుల సాయిరాం పాల్గొన్నారు.

తిరోగమన దిశగా విశ్వ విద్యాలయాలు

• ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్ (తిరుపతి)

దేశ ప్రగతికి నమూనాలుగా ఉండాల్సిన విశ్వవిద్యాలయాలు పరిశోధనలకు ఫెలోషిప్‌లు ఇవ్వకపోవడంతో తిరోగమన దశలో ఉన్నాయని ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను విమర్శించారు. తిరుపతి ఎస్‌వియులో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం జరుగుతున్న యూనివర్సిటీల రాష్ట్ర కన్వెన్షన్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విపి సాను మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగ పరిస్థితులపై చర్చించకుండా దేశం పేరుపై రగడ సృష్టిస్తోందన్నారు. చరిత్రకారులు చెబుతున్న వాస్తవాలు కాకుండా తాము చెప్పిందే వాస్తవంగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న సంస్థలతో చెప్పిస్తూ రాజకీయ లబ్ధిపొందే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితులను ఉపయోగించుకుని కేంద్ర ప్రభుత్వం విశ్వ విద్యాలయాల స్వయం ప్రతిపత్తిని హరించేలా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందన్నారు.

ప్రభుత్వ యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులను రేషనలైజేషన్ చేస్తుందని, అందులో భాగంగానే రాష్ట్రంలోనూ అనేక రకాలైన కోర్సులను ఇతర కోర్సుల్లో విలీనం, లేదా డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లోకి ఆ కోర్సులను మార్పు చేయడం విశ్వ విద్యాలయాల ప్రగతికి గొడ్డలిపెట్టు వంటిదని అన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీ అధ్యాపక పోస్టుల రేషనలైజేషన్ ఉత్తర్వులను రద్దు చేసేలా ఈ కన్వెన్షన్ ద్వారా భవిష్యత్ కార్యాచరణకు ఆయా యూనివర్సిటీల నాయకత్వం కృషి చేయాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న నిధులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నెలవారీ జీతాలకూ చాలకపోవడంతో దేశవ్యాప్తంగా రెగ్యులర్ సీట్లతో పాటు, సెల్ఫ్ సపోర్టింగ్ సీట్లు తీసుకొచ్చి ఉన్నత విద్యను అంగట్లో సరుకులా అమ్మేందుకు నూతన జాతీయ విద్యా విధానం అవకాశం ఇచ్చిందని విమర్శించారు.

రాష్ట్రంలో ఈ విద్యా వ్యాపారం లాభసాటిగా సాగుతోందన్నారు. ఈ సమస్యలపై కార్యాచరణకు కేరళ వేదిక సెప్టెంబర్ 25, 26, 27 తేదీలలో దేశ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థుల కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కన్వెన్షన్‌లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్, కార్యదర్శి అశోక్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ మాధవ్, కిరణ్, వివిధ యూనివర్శిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాష్ట్ర సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్ఎఫ్ఐ జాతీయ అధ్యక్షులు విపి సాను

కేంద్ర, రాష్ట్ర విధానాలపై సమరశీల పోరాటాలు

• సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - విఆర్.పురం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

కేంద్రంలోని బిజెపి నిరంకుశ పాలనపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం కోతులగుట్ట గ్రామంలో పార్టీ ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వి.శ్రీనివాసరావు మాట్లాడారు. దేశంలో మోడీ నిరంకుశ పాలన కోరలు చాచిందని, మతతత్వాన్ని రెచ్చగొట్టి ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలపై దాడులకు దిగుతున్నారని తెలిపారు. మోడీ తన అనుయాయులైన అదానీ, అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని విమర్శించారు. గిరిజన హక్కులను, చట్టాలను నిర్వీర్యం చేస్తున్నారని తెలిపారు. దేశంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న అత్యాచారాలు, దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రజా వ్యతిరేక విధానాలను, ప్రమాదకర మతతత్వ రాజకీయాలను సమిష్టిగా ఎదుర్కోవాలని, రాబోయే ఎన్నికల్లో బిజెపి, దాని అనుబంధ శక్తులను ఓడించాలని కోరారు.

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులకు పాల్పడుతూ, అక్రమ అరెస్టులు చేస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. చట్టంలోని పౌర హక్కులను కాలరాస్తూ తన ఇష్టానుసారంగా చట్టాలను చుట్టాలుగా మలుచుకొని ప్రతిపక్షాలపై విరుచుకు పడుతోందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు అమరవీరులకు నివాళ్లర్పించారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రభుత్వ రంగ పరిశ్రమలతోనే 'ప్రకాశం' అభివృద్ధి : పి మధు

• జిల్లా సమగ్రాభివృద్ధి కోరుతూ పాదయాత్ర ప్రారంభం


ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, దొనకొండ

ప్రకాశం జిల్లా అభివృద్ధికి దొనకొండ ప్రాంతంలో ప్రభుత్వ రంగంలోనే భారీ పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు పి.మధు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు ప్యాకేజీ కేటాయించాలని కోరుతూ సిపిఎం చేపట్టిన పాదయాత్రను ఆయన దొనకొండలో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రారంభ సభలో మధు మాట్లాడుతూ.. రాష్ట్రం విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం దొనకొండను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించి విస్మరించిందని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం జిల్లాలో ఒక్క పరిశ్రమను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. మరోవైపు జిల్లాలో ఉన్న పలకలు, గ్రానైట్ పరిశ్రమలు సంక్షోభంలో ఉన్నాయని తెలిపారు. జిల్లా సమగ్రాభివృద్ధికి వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వైద్యంతో పాటు వృత్తిరంగాల్లోనూ చర్యలు చేపట్టాలన్నారు. రైల్వే, ఉక్కు లాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున మైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. వెలుగొండ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఒక సొరంగం పూర్తయినందున దాని నుంచి రైతులకు సాగు, తాగునీరు ఇవ్వాలని కోరారు. ఉపాధి కోసం గతంలో ప్రకటించిన దొనకొండ పరిశ్రమల కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ రంగంలోనే డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం దొనకొండ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్‌హనీఫ్, సీనియర్ నాయకులు జాలా అంజయ్య, పాదయాత్రకు నేతృత్వం వహిస్తోన్న జివి.కొండారెడ్డి తదిరులు పాల్గొన్నారు. అనంతరం దొనకొండ నుంచి ప్రారంభమైన పాదయాత్ర పరిశ్రమల కేంద్రం, రుద్రసముద్రం గ్రామం మీదుగా కొచ్చర్ల కోటకు చేరింది.



పాదయాత్రను ప్రారంభిస్తున్న పి.మధు

అక్షరం
ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
4 విజయవాడ
సోమవారం 11 సెప్టెంబర్ 2023



"కులమతాలు గీసుకున్న గీతలు జొచ్చి
పంజరాన గట్టుపడను నేను
నిఖిల లోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడ నేను"

- జాషువా



నా తల తీస్తానంటావు

మూతికి గుడ్డ
నడుముకు తాటాకు కట్టుకుని
అరిపాదాలతో నీ వీధిలో నడిపించిన
సనాతన ధర్మం వద్దంటే
నా తల తీస్తానంటావు

మా ఆడవారినే జోగినిగా మార్చి
నీ కోరికలు తీర్చుకునే ధర్మం
మాకు వద్దంటే
నా తల తీస్తానంటావు

ఊరి బావిలోనూ చెరువులోనూ
నా దాహం తీర్చుకోనివ్వని
ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు

నీవు పలికే మంత్రాలేవో
పొరపాటున విన్నందుకు
మా చెవిలో సీసం పోయించిన
నీ ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు
తరగతి గదిలో నీ పక్కన
కూచోనివ్వని ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు
వేల ఏళ్ళుగా నీ పీతి తట్టను
మోయించిన ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు

నీ అధికారం నిలుపుకునేందుకు
మాకు మంత్రి పదవిచ్చినా
నీ పక్కన కూచోనివ్వని
ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు
నన్ను ప్రేమించి వచ్చిన
నీ సంతానాన్ని నా తోడుగా
వుండనివ్వని ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు

నీతో పాటు నీ గుడి మెట్లెక్కనివ్వని
నీ ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు
మారుతున్న సమాజంలో
నా వాటా కోసం నేను
పోరాడుతూ తలెత్తితే
చూడలేని ధర్మాన్ని వద్దంటే
నా తల తీస్తానంటావు!

(ఉదయనిధికి మద్దతుగా)

- కెక్యూబ్ వర్మ
94934 36277

వొక రేఖామాత్ర దృశ్యం

సూర్యోదయం చీకటిగానూ
చీకటి పండువెన్నెలగానూ
వెన్నెలకాంతులు శూన్యమై
ఎడతెరపిలేని జడివానలా కురుస్తున్నాయి
వొక యుగారంభ భ్రాంతి
ఆశయాల పొరల్ని చీల్చుకొస్తుంది
మూగరోదనెల్నో ఆకాశం నిండా పరచుకున్నాయి
ఎన్నో జలపాతాల్ని వొక్కబిందువుగా చేసి
గుండెనిండా నింపుకున్నాను.
కాంతిపొరలు రెటీనాలా తనువును కప్పి
అగ్నిపర్వతపు లావా లాంటి
ఉద్వేగాల్ని ప్రవహింపజేస్తున్నాయి
నిజాల నిప్పుల నడకే కదా జీవితమంటే..!
అబద్ధాల అద్దాల మేడల్లో
జీవనచిత్రాలన్నీ మసకబారుతున్నాయి.
ఆయువును బంధించి ఆశల ఆలింగనాల్ని
గాలి చొరబడనంతా చేసుకుందామంటే
తడారని సప్తవర్ణఛాయలు వెక్కిరిస్తున్నాయి.
మనోనేత్రం నిండా ఉషస్సుల్లాంటి వెలుగుల జిలుగులు
దేహం నిండా ఆవరించాయి.
వాలిచేసిన మోసం
శంభూకుడెందుకు చేయలేదో!
ఇప్పటికీ మనసులో ప్రవల్లికగానే
మిగిలి ముద్రితమైంది.
విధిరాత తలరాత`లాంటి అశాస్త్రీయ విభజనరేఖలు
ప్రయాణం నిండా కంటకాలై పరచుకున్నాయి..
నిట్టూర్పు కొన్నిసార్లు
మధురంగానూ ఉంటుంది.
మది తేలిక పడే కొద్దీ
సంక్లిష్టతలూ తేలికయ్యాయి..
కాలం ఎన్ని దోబూచులాడినా
రెప్పలసవ్వడి హెచ్చరిస్తూనే వుంటుంది.
అందుకే క్షణక్షణం పునీతమవ్వడానికి సంసిద్ధుడౌతూనే వుంటాను..

- కెంగార మోహన్

చివరి ఊహ

చుట్టూ వెతికితే ఏమీ దొరకదు

గుండె లోపలికి చేతులు జొనిపి
కాసేపు శూన్యాన్ని హత్తుకుని దుఃఖపడ్డాక
బయటంతా చీకటేనని నిందలు మోపుతూ
లోపలే దాక్కోడం అతిపెద్ద చీకటి ఊబి
బండరాళ్లను నిర్వేదపు ఉలితో చెక్కుతూ
చేతులకెన్నో పదునైన గాయాలు!

రాయిపై రాయి.. రాయిపై రాయి...
ఇదొక కిటికీల్లేని
మహా ఇరుకు కారాగార నిర్మాణం!

వెల్తురు పోట్ల గాయాల గాలుల్ని కోరుకుంటూనే
పలుగును అవతలకు విసిరేసే నిస్సహాయత.


ఏదో ఓ రోజు ఈ నిర్లిప్తతపు బందీఖానాలో
నిండా మునిగిపోకమునుపే
చేతి పిడికిలిలోకి పలుగు చేరాలనీ
వెలుతురి వరదలో రాళ్ళూ, నేనూ కొట్టుకుపోయి
చెరో తీరం చేరాలనే చివరి ఊహ

భయమల్లా ఒక్కటే
ఊపిరైన ఊహ
ఈ బండరాళ్ల గుహలో జీవితఖైదీనేమోనని!

- శ్రీ వశిష్ఠ సోమేపల్లి,
8074779202

కాలాతీతుడు గురజాడ

"ఆధునిక సాహిత్య ప్రపంచంలో తెలుగుదేశపు సరిహద్దులకు అవతల అంతర్జాతీయ కవి సమ్మేళనంలో తెలుగువారి తరఫున ప్రతినిధిగా నిలుచోగలిగినవాడు గురజాడ ఒక్కడే. అతను రాకముందు ఉన్న కవిత్వానికి అతను రాసిన తర్వాత వచ్చిన కవిత్వానికి పోలికే లేదు."
(శ్రీశ్రీ 1954 ఆగస్టు 6- తెలుగు స్వతంత్ర)



సందర్భం

కవిగా మాత్రమే కాదు; కథా రచయితగా గురజాడ ధ్రువతార. కన్యాశుల్కం నాటకకర్తగా ఇక చెప్పేదేముంది? నాటికి నేటికి ఏనాటికీ అదొక సామాజిక చరిత్ర. ప్రాచీన సాహిత్యానికి నన్నయ లాంటి వాడు ఆధునిక సాహిత్యానికి కందుకూరి వీరేశలింగం. వారి కాలం నాటి భాషా సాహిత్యాల స్థితిగతుల వరకు మాత్రమే ఈ పోలిక. కార్య క్షేత్రాలు రచనా లక్ష్యాలు వేరే!

నన్నయ వ్రాయసకారుడు./కందుకూరి కార్యశూరుడు.

తెలుగులో వర్తమాన ప్రక్రియలకు తానే మొదటి కావ్యకర్తనని కందుకూరి చెప్పుకున్నప్పటికీ వాటిని తన అసాధారణ కళా నైపుణ్యంతో మెరుగులు దిద్ది అజరామరమైన కళాఖండాలుగా తీర్చిదిద్దింది గురజాడ మాత్రమే! వీరేశలింగం ప్రధాన కార్యక్షేత్రం సంఘ సంస్కరణ. అందు నిమిత్తమే చాలా రచన చేశాడు. సంఘ సంస్కరణకి ఆయుధంగా సాహిత్యాన్ని ఉపయోగించాడు. ఈ తక్షణ అవసరార్థమే తను రచనలు చేయడం వల్ల ఆ సమస్యలు సమసిపోయిన వెంటనే అవి ప్రాసంగికత కోల్పోయి పాఠక బాహుళ్యానికి దూరమయ్యాయి. వీరేశలింగం తన 44వ ఏట వరకు ప్రాచీన పద్య ప్రక్రియలోనే సంప్రదాయ రచనలే చేస్తూ వచ్చాడు. ఆ తరువాత వస్తు స్వీకరణలో ఆయన దృష్టి మారింది. అభాగ్యోపాఖ్యానం, సరస్వతీ నారద సంవాదం (1875) రచనలతో వస్తువు పట్ల ఆయన దృక్పథం మారింది. ప్రబంధ ప్రక్రియను పాండిత్య ధోరణిని వదిలేసి నవ్య కవిత్వపు ఆలోచనలు ఆవిర్భవించడానికి ఈ రెండు అధిక్షేప రచనలు దోహదం చేశాయి.

1862లో పుట్టిన గురజాడ, వీరేశలింగం లాగే తొలుత ప్రాచీన కవితా ధోరణిలో మాటల మబ్బులు, పుష్పలావికలు, సుభద్ర మొదలైన సంప్రదాయ రచనలు చేశాడు. ఒకపక్క వీరేశలింగం సంఘ సంస్కరణ సంఘర్షణ, మరోపక్క గిడుగు వ్యవహారిక భాషావాదం చర్చ, ఇంకో పక్క చాప కింద నీరులా ఆంగ్ల భాష వల్ల చదల చీకటి కదల బారుతోంది.

సామాజిక రంగంలో వీరేశలింగం, భాషారంగంలో గిడుగు రామమూర్తి కొత్త భావాలను ప్రవేశపెడితే ఆ రెండింటిని తన రెండు చేతులతో అందిపుచ్చుకొని కొత్తపాతల మేలు కలయికలతో క్రొమ్మెరుంగులు చిమ్మాడు గురజాడ.

అందుకే... "పురాణ కథలతో అనువాదాలతో రచనలు వెల్లువెత్తుతున్న రోజుల్లో వర్తమాన సామాజిక వాస్తవికతను వస్తువుగా చేసుకుని రచనలు చేశాడు గురజాడ. తెలుగు సారస్వతంలో నాటకానికి, కవిత్వానికి, కథకు శంకుస్థాపన చేసిన మహా పురుషుడు గురజాడ" అన్నాడు కొడవటిగంటి కుటుంబరావు.

గురజాడ కార్యనిర్వహణకు కావలసిన భూమికను ఏర్పాటు చేసింది కందుకూరి. దానికి చేదోడు వాదోడుగా నిలిచింది గిడుగు రామమూర్తి.

నిజానికి కందుకూరి ఆశించిన లక్ష్యాన్ని తన పదునైన సజనతో సాధించాడు గురజాడ. వస్తువులోనూ శిల్పంలోనూ భాషలోనూ భావనలోనూ విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చాడు. "నా కావ్య కళ నవీనం. కావ్య ఇతివృత్తాలు భారతీయం. కవితలో ఉత్తమ ప్రయోజనాలను లక్షించాను. జీవితాన్ని నూతన దృక్పథంతో దర్శించి కథ కవితా రూపంలో దాని తత్వాన్ని అన్వయించడానికి ప్రయత్నించాను." అన్నాడు. అంతేనా! "నాది ప్రజల ఉద్యమం దానిని ఎవరిని సంతోష పెట్టడానికి వదులుకోను" అని తెగేసి చెప్పాడు.

గురజాడ ప్రయోగవాది. తెలుగు సాహిత్యంలోనే ముత్యాలసరాలు ఒక వినూత్న, అత్యంత సాహసోపేతమైన ప్రయోగం. మాత్రా ఛందస్సులో వాడుక మాటలతో సంస్కరణ భావాలను వ్యక్తపరచడానికి వినియోగించడమే విశేషం. 1892లో కన్యాశుల్కం, 1910లో ముత్యాలసరాలు రాసి నవ్య రీతికి నాంది పలికాడు. వర్తమాన సమాజానికి చెప్పవలసిన భావాలను ఆశు సాంప్రదాయాల నుంచి తీసుకొని చెప్పడం గురజాడ తొక్కిన కొత్త పుంత. అంటే చెప్పే పద్ధతి పాతది, విషయం కొత్తది. దానికి ముత్యాల సరాలు అని నామకరణం చేశాడు.

"గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకొని తేటైన మాటల
కొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా" అని తన కవితా లక్షణాన్ని ప్రారంభంలోనే ప్రకటించాడు. ముత్యాల సరాలు గేయం సంఘంలో ఉన్న మూఢనమ్మకాన్ని ప్రశ్నించింది. అరుదుగా వచ్చే తోకచుక్క వల్ల కీడు కలుగుతుందనే గుడ్డి నమ్మకాన్ని ఖండిస్తుంది. సంఘసంస్కరణ భావాలకు ప్రతీకగా భర్తను సామాజిక విశ్వాసాలకు ప్రతీకగా భార్య పాత్రలను ఈ గేయంలో ప్రవేశపెట్టాడు గురజాడ.

"సన్నకాలపు చిన్న బుద్ధులు
బెదిరి యెంచిరి కీడుగా" శాస్త్ర విజ్ఞానం లేని రోజుల్లో ప్రకృతి పరిణామాన్ని, ప్రజలు అర్థం చేసుకున్న తీరునీ తను తోకచుక్కను ఎలా దర్శించిందీ గురజాడ చెబుతున్నాడు.

"దూరపు బంధువు యితడు భూమికి
దారిపోవుచు చూడవచ్చెను....
తలతునేనిది సంఘసంస్కరణ
ప్రయాణ పతాకగన్" లోకం తోకచుక్కని అపశకునంగా భావిస్తే గురజాడదాన్ని దారిన పోతూ వచ్చే దూరపు చుట్టంగా భావించాడు. సంఘసంస్కరణ జెండాగా చేపట్టాడు. దానినే తన కవిత్వపు ఎజెండాగా మార్చుకున్నాడు. ఇలా ఒకపక్క సంస్కరణ భావాలు ప్రవేశ పెడుతూనే మరోపక్క జాతి మత వర్ణ భేదాలను నిరసించాడు. జ్ఞాన మార్గాన్ని కీర్తించాడు.

"యెల్ల లోకము వొక్క యిల్లై
వర్ణభేదములెల్ల కల్లై/ వేల నెరుగని ప్రేమబంధము
వేడుకలు కురియ" అంటూనే..
"మతములన్నియు మాసిపోవును
జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అని చివరకు మిగిలేది ఏమిటో చాటి చెప్పాడు.

"కాసులు" కవిత సంభాషణ ధోరణిలో సాగుతుంది. ఇందులో ఆదర్శ దాంపత్యాన్ని చిత్రించాడు .ప్రేమ పెన్నిధి లాంటిదని ప్రేమ లేనిదే బతుకు చీకటని, ప్రేమ గొప్పతనాన్ని చెప్పాడు. దంపతుల మధ్య ఉండాల్సిన ఆదర్శ ప్రేమను గురించి చెబుతూ ..
"మగడు వేల్పన పాత మాటది
ప్రాణమిత్రుడ నీకు" అంటాడు.

భార్య భర్తల మధ్య ఉండాల్సినవి అధికార సంబంధాలు కావు. 'ప్రాణస్నేహం' అనే కొత్త విలువని గురజాడ మొదటిసారి ప్రతిపాదించాడు. ఇది ఎంత గొప్ప ప్రజాస్వామిక భావన!

"లవణ రాజు కల"లో కులం కన్నా గుణం గొప్పదని చెప్పాడు.
"మలిన దేహుల మాలలనుచును
మలిన చిత్తుల కధిక కులముల
నెలవొసంగిన వర్ణధర్మమధర్మ ధర్మంబే" అని నిరసించాడు.
"మంచి చెడ్డలు మనుజులందున
యెంచి చూడగ రెండె కులములు
మంచి యన్నది మాల యైతే
మాలనే అగుదున్" అన్నాడు. ఇది మామూలు మాట కాదు. ఆ కాలం నాటికి ఇది విప్లవ ప్రతిపాదన. దళితుల కులాన్ని తిట్టుగా పలికినా నిప్పులతో నోటిని పుక్కిలించే పోగాలమది.

"కన్యక"లో కూడా కులం కన్నా గుణం గొప్పదని చెప్పాడు. శిథిలమైన రాచరిక వ్యవస్థలోని ఒక సాంఘిక దురన్యాయాన్ని కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. దేవాలయానికి వెళుతున్న కన్యకని దారిలో రాజు అధికార మదంతో చేపట్టబోతే ఆమె ఆత్మాభిమానంతో ఎదిరిస్తుంది. దౌర్జన్యం కూడదని ధర్మంగా స్వీకరించమని ఆమె తండ్రి వేడుకున్నా రాజు తిరస్కరిస్తాడు. రాచరిక వ్యవస్థలోని క్రౌర్యం సామాజిక దౌష్ట్యం ఈ చర్య వల్ల మనకు తెలుస్తుంది.

"పట్టమేలే రాజువైతే/ రాజునేలే దైవముండడో" అంటూ తల తన్నేవాడుంటే తాడిదన్నే వాడుంటాడనీ...
"కండకావరమెక్కి నీవీ/ దుండగము తలపెట్టినందుకు
ఉండడా ఒక దైవమంటూ/ ఉండి ఊర్కొనునా?"

రాచరికంలో రాజే రక్షకుడు. కానీ, కంచే చేను మేస్తే ఇక కన్యకకి రక్షణ ఎక్కడిది? చివరికి అగ్నిలో దూకింది. నిజానికి దూకింది ఆమె కాదు. అక్కడ రాజు పరపతే మంట గలిసింది. చివరికి -
"పట్టమేలే రాజు పోయెను/ మట్టి కలిసెను కోటపేటలు
పదం పద్యం పట్టి నిలిచెను/ కీర్తులపకీర్తుల్.." ఆమె కీర్తి అతని అపకీర్తి చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోయాయి.

"పూర్ణమ్మ" కరుణరసాత్మకమైన గేయం. ఇది నాటి సాంఘిక దురాచారానికి నిరసనగా రాసింది. ముక్కుపచ్చలారని ముద్దులొలికే పిల్లని కాటికి కాలు చాచుకునే వాడికి కట్టబెట్టడం కథ. డబ్బుకు దాసోహమైన క్రూరమైనలోకం కథ. ముసలి మొగుడుతో అత్తవారింటికి పూర్ణమ్మ బయలుదేరుతుంటే ఇంట్లో అందరూ బాధ పడుతూ ఏడుస్తారు. కానీ, " కాసుకు లోనై అల్లుని తలుచుకు/ ఆనందించెను అయ్యొకడే"నట!

కన్న కూతురు సౌభాగ్యం కన్నా కాసులే ప్రధానమైన తండ్రిని చూస్తే అభిమానం కంటే ఆర్థికానిదే పైచేయని అర్థమవుతుంది. డబ్బుజబ్బుచేసిన లోకానికి గురజాడ తన సృజనతో సాహితీ వైద్యం చేయడానికి పూనుకున్నాడు. "మనిషి" కవితలో మానవతావాదాన్ని ప్రతిపాదించాడు. రాళ్ళని రప్పలని పూజించడం కన్నా నీ ఎదుటనున్న మనిషిలోనే మహాత్ముడు ఉన్నాడని చెప్పాడు.

"కన్ను తెరచిన కానబడడో/ మనిషి మాత్రుడి యందు లేడో
యెరిగి కోరిన కరిగి యీడో ముక్తి" అంటూ హితబోధ చేస్తాడు.

"దేశభక్తి"గేయం గురించి ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. గురజాడ రచనలన్నీ శిథిలమైపోయి ఒక్క దేశభక్తి మిగిలినా చాలును, అతన్ని ప్రపంచ మహాకవిగా గుర్తించడానికి అంటాడు శ్రీశ్రీ. రోణంకి, చాసో లాంటి పెద్దలు దేశభక్తి గేయంలోని కొన్ని చరణాలు ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయం గోడల మీద రాయదగ్గవని కీర్తించారు. ఈ గేయం విశ్వమాన ప్రేమకు ఎత్తిన స్వర్ణ పతాక. "దేశమును ప్రేమించుమన్నా" అన్న మాటతో ప్రారంభమై, "దేశమందభిమానములు మొలకెత్తవలనోయి" అన్న మహాలక్ష్యంతో ముగుస్తుందీ గేయం. "దేశమంటే మట్టి కాదోయ్/ దేశమంటే మనుషులోయ్" అని సజీవమైన నిర్వచనం ఇచ్చాడు గురజాడ.

"చెట్టపట్టాల్ పట్టుకుని/ దేశస్థులంతా నడవవలెనోయి/ అన్నదమ్ముల వలెను జాతులు/ మతములన్నీ మెలగవలెనోయి" అంటూ ఆధునిక జీవన సూత్రం ప్రతిపాదించాడు. సామరస్య జీవన ప్రస్థానానికి మార్గం సుగమం చేశాడు. "దేశమనియెడి దొడ్డవృక్షం/ ప్రేమలను పూలెత్త వలెనోయ్" కులమత బేధాలు విడనాడి ఏ ప్రాంతం వాళ్ళయినా 'మనందరం మనుషులం' అనే సంగతి గుర్తుపెట్టుకుని మెలగమన్నాడు. నైసర్గిక చిహ్నాలు ఏవీ లేనందున కేవలం మనిషిని కేంద్రంగానే చెప్పడం వల్ల ఈ దేశభక్తి గేయం ప్రపంచంలో ఏ దేశస్థులకైనా వారి జాతిగీతంగా పాడుకునే సౌలభ్యం ఉంది. "మతం వేరైతేను యేమోయి/ మనసులొకటై మనుషులుంటే" నిజంగా మహాకవి ఆశించినట్టు ఇలాగే ఉంటే దేశం ఎంత బాగుంటుందో ఊహించండి. దేశ చట్టసభల్లో ఇది తప్పనిసరి ప్రార్థన గీతం కావాలి. మన మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకునే రాజకీయ రక్కసులకి ఈ గేయం వాళ్ళ దినచర్యలో తప్పనిసరి పఠనం కావాలి. అలా అయితే ఏదో ఒక రోజు ఏదో ఒక నాటికి వాళ్ల బుద్ధి మారకపోతుందా?

దేవులపల్లి గారు అన్నట్టు గురజాడ మరణించిన తరువాతే జీవించడం మొదలుపెట్టాడు. వెంటనే కాదు సుమండీ! పునరుజ్జీవనానికి కొంత కాలం పట్టింది. దీనికి సరైన కారణం కొత్తపల్లి వీరభద్ర రావు గారు ఊహించారు. "గురజాడ మరణించిన పాతికేళ్ల వరకు ఆయన్ని ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీనికి కారణం ఆయన రచనల లోపం కాదు. ఆయన రచనల్నీ ఆ మనిషిని అర్థం చేసుకోవడానికి, గుర్తించడానికి తెలుగు వారు చాలా విషయాలు నేర్చుకోవలసి రావడమే ముఖ్యం కారణం" అన్నారు. ఇది అక్షరాలా నిజం.

"ఏమైనా ఆయన మరణించిన చాలాకానికి తప్ప గురజాడ ప్రభావం ఆయన జీవించి ఉన్న రోజుల్లో సువ్యక్తం కాలేదన్నది సత్యం. ఆదిలో చిన్న పాయగా ఉండిన గురజాడ ప్రభావం ప్రారంభంలో నెమ్మదిగా ఆ తరువాత వేగంగా పెరిగి పెద్దదై రాను రాను పరవళ్ళు తొక్కి ఒక మహా ప్రవాహంలాగా అయింది" ఇది ప్రముఖ పత్రికా సంపాదకుడు నార్ల వారి మాట.

(సెప్టెంబరు 21 : గురజాడ జయంతి)

- జి.ఎస్.చలం
89196 93250

అభ్యుదయ కవి దువ్వూరి



నివాళి

నేడు వర్ధంతి

వందేళ్ల క్రితమే తెలుగు సాహిత్యం ఆధునిక పోకడలను సంతరించుకుంది. వీరి ఆధునిక కవిత్వం అనువదించబడి ఆరు దేశాల్లో విస్తృత చర్చ జరిగింది. ఇప్పటికీ తెలుగు సాహిత్యంలో ఈ కృషీవలుని కవిత్వం నిత్యం మథించబడుతూనే ఉంది. వారే దువ్వూరి రామిరెడ్డి. 'కవి కోకిల'గా ప్రసిద్ధిగాంచిన దువ్వూరి నిజానికి తొలితరం అభ్యుదయ కవి. వస్తు- శిల్ప సంపదకు ఎనలేని ప్రాధాన్యతనిచ్చిన కవి. కవిత్వం అంటే ఏమిటనే దానికి దువ్వూరి సాహిత్యమే చిరునామా. కవిత్వపు రహస్యాలకు పుట్టినిల్లు. ఆంగ్లంలోకి అనువాదమైన రామిరెడ్డి పద్యాలపై వివిధ దేశాల్లో చర్చలు జరిగాయి. తిక్కన ఉదాత్తమైన తెలుగుదనాన్ని అందిపుచ్చుకున్న దువ్వూరి కవిత్వంలోని సంగీత రిథమ్ ఆయనకు అపారమైన గుర్తింపు రావడానికి కారణమైంది.

'నేను గృహ విద్యాలయ శిక్షితుడను' అని వినయ మనస్కుడై చెప్పుకొన్నవారు కవికోకిల దువ్వూరి రామిరెడ్డి. స్వాతంత్ర్య సమర కవితా యోధుడిగా, కవితా కృషీవలుడిగా, మానవతామూర్తిగా, జాతీయ వాదిగా విజ్ఞాన సారస్వత మూర్తిగా బహుముఖ పాటవాలను ప్రదర్శించిన వ్యక్తి దువ్వూరి. 1911 బ్రిటీష్ ప్రభుత్వం కొన్ని గ్రంథాలను నిషేధించింది. కానీ దీనికి ముందుగానే దువ్వూరి 'మాతృశతకం'ను నిషేధించారు. ఆనాడు బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించిన గ్రంథాల్లో శృంగారగ్రంథాలే ఎక్కువ. తెలుగు భాషాభిమానులైన పిఠాపురం రాజా, బయ్యా నరసింహేశ్వరశర్మ, జయంతిరామయ్య, పేరి నారాయణమూర్తి మొదలైన పెద్దలు సభ జరిపి ప్రభుత్వానికి తమ నిరసన వ్యక్తం చేశారు. శృంగార కావ్యాలపై నిషేధం వల్ల అనేక కావ్యాలు లిఖితాలుగానే నిలిచిపోయాయి. 'దువ్వూరి 'మాతృశతకం', వావిళ్ళ వెంటేశ్వరశాస్త్రి రచించిన శ్రీనాథుని వీధి నాటకాన్ని బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించడంపై తెలుగు సమాజంలో ఎక్కువ నిరసనలు వ్యక్తమయ్యాయి. రాజాజీ మద్రాసు ముఖ్యమంత్రి అయినప్పటికీ నిషేధం వీడకపోవడం భాషాభిమానుల్లో మరింత ఆగ్రహానికి కారణం అయింది. 1947లో ప్రకాశం పంతులు ముఖ్యమంత్రి అయిన తర్వాతనే వీటికి చెర వదిలింది. ఉత్తముడైన కవి మరణించినా ఆయన సాహిత్యాన్ని గురించి కొత్త పరిశీలన, పరిశోధన, అనుశీలన సాగుతూనే ఉంటుంది. అందుకే కవికి మరణం లేదన్నది నానుడికి కవికోకిల దువ్వూరి రామిరెడ్డి సజీవ సాక్ష్యం. ఆయన రచనలు నేటికీ పరిశోధనా కావ్యాలే. ఆయన రచనలన్నీ దాదాపు తొమ్మిది సంపుటాలుగా వెలువడ్డాయి. కొన్ని ఏడెనిమిది ముద్రణలు కూడా పొందాయి. ఆయన డైరీలు, ఉత్తరాలు, జాబులు ఒక చిన్న సంపుటిగా కూడా వెలువడింది. ఆయన జీవితం, సాహిత్యంపై ఒక పెద్ద గ్రంథమే అచ్చయింది. కవికోకిల అముద్రిత గ్రంథాలు అలాగే నిలిచిపోవడం ఒక చారిత్రక విషాదం. అభ్యుదయ కవిత్వం గురించి శ్రీశ్రీ ఒక వ్యాసం రాస్తూ ... ఆధునిక కాలంలో మొట్టమొదటి వచన గేయం రాసింది దువ్వూరి రామిరెడ్డి అని అన్నారు. గ్రంథరూపంలో రావల్సిన, రాదగిన కవి కోకిల అముద్రిత గ్రంథాలు ఇంతవరకూ వెలుగు చూడకపోవడం దురదృష్టకరం. ప్రారంభ రచనలు, పరిమిత రచనలు ఇంకా ఎన్నో ఉన్నాయంటే సాహితీ కారులకు ఆశ్చర్యమే మరి! 'గుడివాడ రత్నం' అనే ఒక కథ, 'నా దేశాటనం డైరీ' అనే బయోగ్రాఫికల్ వ్యాసం పాత భారతిలో అచ్చయ్యాయి.

1917లో 'కవి సొంత అక్షరాలతో రాసిన 'కర్షక విలాసం' అనే నాటకం అదృష్టవశాత్తూ ప్రతి భద్రపరచి ఉంది. ఈ నాటకాన్ని 1917లో నెల్లూరు టౌన్‌హాల్లో ప్రదర్శించారు. ఇది ఇప్పటికీ గ్రంథస్థం కాలేదు. 'ధృవ' అనే మరో నాటకం కూడా అముద్రితమే. రేబాల లక్ష్మీనరసారెడ్డి మరణించిన సందర్భంగా దువ్వూరి రాసిన పద్యాలు, తనకు తెలుగు చెప్పిన అయ్యావారి స్మృతి సూచికగా రాసిన పద్యరచన, విలువిద్యలో నిపుణుడైన కలియుగార్జుడిపై రాసిన పద్యాలు, మరికొన్ని పద్య ఖండికలు, కొన్ని ఇంగ్లీషు జాబులు, రచనలు, వ్యాసాలు, ఇలా అన్నింటిని కెవి రమణారెడ్డి ప్రెస్ కాపీని అప్పట్లో సిద్ధం చేశారు.

దువ్వూరి అముద్రిత రచనలు ఇంకా వెలుగుచూడాల్సి ఉన్నాయని శ్రీవాత్సవ అనేకసార్లు ప్రస్తావించారు. 1927లో నెల్లూరులో పెద్ద గాలివాన వచ్చినపుడు, దువ్వూరి 'తుఫాన్' కథ ఆంధ్రదినపత్రికలో అచ్చయినట్లు చెబుతుండేవారు. ఎంతో బాధ్యతగా చెప్పిన ఈ కథ విషయం ఎంత గాలించినా పత్రికలో పరిశోధకులకు దొరకలేదు. ఇంకా వెలుగు చూడాల్సిన కవి కోకిల ఇంగ్లీషు అనువాదిత గేయ రచనలు 'వాయిస్ ఆఫ్ ద రీడ్' ఆచ్చయిన తరువాత రామిరెడ్డి 'ఫలిత కేశం' కావ్యాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు. మరికొన్ని చిన్న గేయాలు కూడా ఇంగ్లీషులో రాసి పెట్టారు. వీటన్నింటిని లండన్ ప్రెస్ వారిచే అచ్చు వేయించేందుకు ఒక ప్రయత్నం జరిగింది. పి.వి. రాజమన్నార్, కవికోకిల 'కళ పత్రిక రోజుల్లో రాసిన జాబుల కట్ట ఉందన్నారు. ఆ సంపుటం కూడా తయారు కావలసి ఉన్నది. దువ్వూరి అముద్రిత, గ్రంథ రూపంలో రాని రచనలను ఒక పుస్తకంగా తీసుకురావల్సిన అవసరం ఉంది.

(దువ్వూరి రామిరెడ్డి జననం : నవంబరు 9, 1895.
మరణం : సెప్టెంబరు 11, 1947)

- ఈతకోట సుబ్బారావు
94405 29785

జయప్రద, జమున పురస్కారాలకు ఆహ్వానం

ప్రతి ఏటా జాతీయ స్థాయిలో ఇస్తున్న జమున స్మారక నానీల సంపుటి అవార్డు, డాక్టర్ పెళ్ళకూరు జయప్రద సోమిరెడ్డి నవలా అవార్డులకు ఈ ఏడాది కూడా ఎంట్రీలు ఆహ్వానిస్తున్నారు. 2022, 2023 ఆగస్టు వరకూ ప్రచురితమైన నానీల సంపుటి, నవలలను ఆయా రచయితలు 3 కాపీలను 31 అక్టోబర్ 2023 లోగా పంపాల్సిందిగా కోరుతున్నాం. ఎంపికైన ఉత్తమ నానీల సంపుటికి రూ.10 వేలు, ఉత్తమ నవలకు రూ.15 వేల నగదు పురస్కారం ఉంటుంది. కాపీలు పంపాల్సిన చిరునామా : అవ్వారు శ్రీధర్ బాబు, 23-1-57. పెండెం వారి వీధి, ఫత్తేఖాన్ పేట, నెల్లూరు -524003. ఫోను 85001 30770.

- సోమిరెడ్డి వెంకట శేషారెడ్డి

'స్త్రీల రచనలు- సమాలోచన'పై జాతీయ సదస్సు

అన్వేషి, రీసర్చ్ సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్, ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖలు సంయుక్తంగా 'స్త్రీల రచనలు- విభిన్న దృక్పథాలు: సమాలోచన' అనే అంశంపై రెండు రోజులు జాతీయ సదస్సు నిర్వహిస్తున్నాయి. సెప్టెంబర్ 14, 15 తేదీల్లో ప్రభుత్వ సిటీ కళాశాల ప్రాంగణంలో ఆజామ్ హాల్లో జరిగే ఈ సదస్సు ప్రారంభ సభలో ఓల్గా, డా.ఉమామహేశ్వరి భగుబండ, డా.మామిడి హరికృష్ణ, ఆచార్య పి.బాలభాస్కర్, డా.కోయి కోటేశ్వరరావు, డా.కె.లలిత పాల్గొంటారు. ఆచార్య.సి.మణాళిని కీలకోపన్యాసం చేస్తారు. కాత్యాయని విద్మహే, కె.మధుజ్యోతి, చల్లపల్లి స్వరూపరాణి, తిరునగరి దేవకీదేవి, ఎం.ఎం.వినోదిని, డా.కె.ఎన్.మల్లీశ్వరి, గోగు శ్యామల, గౌరీ కృపానందన్ తదితరులు పాల్గొంటారు.

- కె.సజయ, డా.జె.నీరజ

2023 నాగయ్య పురస్కార విజేతలు వీరే!

ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు ఎం.చిన నాగయ్య స్మారక జాతీయ పురస్కారానికి వ్యాసాల విభాగంలో పి.తిరుపతిరావు (రాజాం), ఎల్.ఆర్.వెంకట రమణ (అనంతపురం), కవిత్వం విభాగంలో సోంపాక సీత (భద్రాచలం), టి.నీలిమ (హైదరాబాద్), బి.జయరావు (నెల్లూరు); కథల విభాగంలో ఎన్. అనురాధ (విజయవాడ), ఎం.సుగుణరావు (విశాఖపట్నం), జె. సుబ్బారావు (నూజివీడు), బి.కళా గోపాల్ (నిజామాబాద్); జీవిత చరిత్రల విభాగంలో ఎస్.డి.వి.అజీజ్ (కర్నూలు) ఎంపికైనట్లు చిన నాగయ్య మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి ఎం.రాం ప్రదీప్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజేతలకు అక్టోబర్‌లో తిరువూరులో పురస్కారాలని అందజేస్తామని వివరించారు.

పి.సుష్మకు కుసుమ ధర్మన్న యువ సాహిత్య పురస్కారం

కుసుమ ధర్మన్న యువ సాహిత్య పురస్కారానికి జాతీయ స్థాయిలో వచ్చిన దరఖాస్తుల నుంచి పి.సుష్మ (మక్తల్, నారాయణ ఖేడ్ జిల్లా, తెలంగాణ) ఎంపికయ్యారు. ఈ పురస్కారాన్ని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డా.రాధా కుసుమ (కుసుమ ధర్మన్న మనుమరాలు) సెప్టెంబర్ 8వ తేదీన హైదరాబాద్ రవీంద్ర భారతిలో ప్రదానం చేశారు.



మహాత్మునికి జి20 అధినేతల నివాళి

న్యూఢిల్లీ : జి20 శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి విచ్చేసిన వివిధ దేశాధినేతలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు ఆదివారం రాజ్‌ఘాట్‌ను సందర్శించి మహాత్మాగాంధీకి ఘన నివాళులర్పించారు. రాజ్‌ఘాట్‌కు వచ్చిన నేతలు, అధికారులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన గుజరాత్ సబర్మతి ఆశ్రమం ఫొటో గురించి ప్రధాని విదేశీ అతిథులకు వివరించారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునక్, బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా, ఫ్రాన్స్ అధినేత ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ తదితర సభ్యదేశాల అగ్రనాయకులు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహాత్మాగాంధీ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫలకంపై సంతకాలు చేశారు. తర్వాత అతిథి నేతలంతా భారత మండపంలోని లీడర్స్ లాంజ్‌కు వెళ్లారు.

విభిన్న దేశాలకు చెందిన అధినేతలంతా కలిసికట్టుగా గాంధీజీకి నివాళులర్పించిన ఫోటోలను ప్రధాని మోడీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. శాంతి, సేవానిరతి, కరుణ, అహింసకు దీపధ్వజంగా వర్ధిల్లిన మహాత్మాగాంధీకి జి20 కుటుంబం శ్రద్ధాంజలి ఘటించిందని ఆయన పేర్కొన్నారు. సామరస్యపూర్వకమైన, సమ్మిళిత, సుసంపన్న ప్రపంచ భవిష్యత్తు కోసం సమిష్టి దార్శనికతకు మహాత్మాగాంధీ కాలాతీతమైన మార్గదర్శి అని మోడీ ఈ సందర్భంగా



కొనియాడారు.

మేక్రాన్‌తో విందు భేటీ

జి20 సదస్సు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆదివారం కూడా వివిధ దేశాధినేతలతో సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చించారు. రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి నివాళులర్పించిన అనంతరం మధ్యాహ్న భోజనం సమయంలో ఫ్రాన్స్ అధ్యక్షులు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్‌తో ప్రధాని మోడీ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ విందు భేటీలో ఇరు దేశాల మంత్రులు, దౌత్య ప్రతినిధులు కూడా పాల్గొన్నారు. ఇరుదేశాల సంబంధాలను మరింత ఉన్నత స్థితికి తీసుకెళ్లేందుకు దోహదం చేసే అనేక అంశాలపై చర్చలు జరిపినట్లు ప్రధాని మోడీ పోస్టు చేశారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడెయూతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. వివిధ రంగాల్లో ఇరుదేశాల సంబంధాలపై చర్చలు జరిపినట్లు మోడీ తెలిపారు. అలాగే జి20లో తాజాగా శాశ్వత సభ్యత్వం పొందిన ఆఫ్రికా యూనియన్ అధ్యక్షులు అజలి అసమానితో కూడా మోడీ ద్వైపాక్షికంగా సమావేశమయ్యారు. జి20లో చేరినందుకు మోడీ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. టర్కీ అధ్యక్షుడు ఆర్‌టి ఎర్డోగాన్‌తోనూ, జర్మనీ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్‌తోనూ, బ్రెజిల్ అధ్యక్షులు లులా డ సిల్వాతోనూ మోడీ వేర్వేరుగా సమావేశమయ్యారు. భారత్, బ్రెజిల్ మధ్య సంబంధాలు చాలా పటిష్టంగా ఉన్నాయని ఈ సందర్భంగా మోడీ చెప్పారు. వ్యవసాయం, సాంకేతిక, ఇతర రంగాల్లో ఇరుదేశాల మధ్య సహకారం, వాణిజ్య వృద్ధి పెంపొందించడంపై చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు.

భారత్‌కు అభినందనలు

చారిత్రక జి20 శిఖరాగ్ర సదస్సును విజయవంతంగా నిర్వహించినందుకు భారత్‌ను అమెరికా అధ్యక్షుడు జో బైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్, టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ తదితర దేశాధినేతలు అభినందించారు. ఉక్రెయిన్‌పై తీర్మానాన్ని రష్యా సమర్థించింది. మాస్కోపై నేరుగా విమర్శలు చేయకుండా సమతూకం పాటించడాన్ని రష్యా విదేశాంగ మంత్రి లవ్‌రోవ్ చెప్పారు. అయితే ఉక్రెయిన్‌పై జి20 సదస్సు ఆమోదించిన తీర్మానాన్ని జపాన్ ప్రధాని కిషిడా తోసిపుచ్చారు. ఇది బలహీనమైన తీర్మానమని వ్యాఖ్యానించారు. పర్యావరణంపై ప్రజలలో అవగాహన కలిగించేందుకు సభ్య దేశాల నేతలు భారత్ మండపంలో మొక్కలు నాటారు. కాగా సదస్సు చివరి సమావేశానికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హాజరు కాలేదు. ఆయన వియత్నాం బయలుదేరి వెళ్లారు.

అక్షరధామ్‌లో రిషి సునక్ పూజలు

బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునక్ దంపతులు ఆదివారం ఉదయం ఢిల్లీలోని అక్షరధామ్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను హిందువునని, హిందువుగానే పెరిగానన్నారు. భారతీయ సంప్రదాయాలంటే ఎంతో గౌరవమని చెప్పారు. రక్షాబంధన్ కూడా ఘనంగా జరుపుకున్నామని, తన సోదరి, తోబుట్టువులు రాఖీలు పంపారని ఆయన తెలిపారు.



మహిళలకు డిజిటల్ సాధికారత

- జి20లో తీర్మానం

న్యూఢిల్లీ : మహిళా సాధికారతకు పెద్ద పీట వేయాలని జి20 సదస్సు నిర్ణయించింది. వేతన వ్యత్యాసాలు, లైంగిక హింస, ఉద్యోగావకాశాలు, ఆహార భద్రత వంటి విషయాలలో చొరవ తీసుకోవాలని, ముఖ్యంగా డిజిటల్ కార్యకలాపాలలో మహిళలు అధిక సంఖ్యలో భాగస్వాములయ్యేలా చూడాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సదస్సు చివరి రోజైన ఆదివారం నాడు జి20 దేశాధినేతలు డిక్లరేషన్‌ను ఆమోదించారు. జి20 దేశాలలోని మహిళా మంత్రిత్వ శాఖలకు బాసటగా నిలిచేందుకు మహిళా సాధికారతపై కొత్తగా కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయాలని డిక్లరేషన్‌లో తీర్మానించారు. బ్రెజిల్‌లో జరిగే తదుపరి జి20 దేశాల సదస్సులో ఈ కార్యాచరణ బృందం తొలి సమావేశాన్ని నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిజిటల్ కార్యకలాపాలను మహిళలతో పోలిస్తే పురుషులే ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి, మహిళలు కూడా ఆ కార్యకలాపాలలో క్రియాశీలకంగా పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సదస్సు నిర్ణయించింది.

2030 నాటికి డిజిటల్ కార్యకలాపాలలో మహిళలు, పురుషుల మధ్య వ్యత్యాసాలను సాధ్యమైనంత వరకూ తగ్గించాలని సదస్సులో తీర్మానించారు. డిజిటల్ అక్షరాస్యత, నైపుణ్యాలను పెంచడం సహా జాతీయ డిజిటల్ వ్యూహాల రూపకల్పన, అమలులో మహిళలు, బాలికలు మరింత క్రియాశీలకంగా పాల్గొనేందుకు అవసరమైన విధానాలను రూపొందించాలని ప్రతిపాదించారు. డిజిటలీకరణ ప్రక్రియలో భద్రతాపరంగా మహిళలు, బాలికలకు ఎదురయ్యే ముప్పును సదస్సు గుర్తించింది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల ద్వారా మహిళలను కించపరిచే ప్రయత్నాలు జరగవచ్చునని, డిజిటల్ సాధనాలు, సాంకేతిక పరిజ్ఞానాలలో సురక్షితమైన విధానాలను రూపొందించుకొని వీటిని నివారించవచ్చునని అభిప్రాయపడింది. ముఖ్యంగా మహిళల నేతృత్వంలో, వారి యాజమాన్యంలోని వ్యాపారాలలో వివక్షకు తావులేని డిజిటల్ ఎకానమీని ఆచరణలో పెట్టాలని తీర్మానించింది. మహిళలు, బాలికలపై వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య నష్టాలు, కాలుష్యం వంటివి చూపే ప్రభావాన్ని జి20 సదస్సు గుర్తించింది. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు మహిళల భాగస్వామ్యం, నిర్ణయాలు తీసుకోవడంలో వారి ప్రమేయం, నాయకత్వ లక్షణాలను మరింతగా పెంచాలని నిర్ణయించింది. పర్యావరణానికి సంబంధించిన విషయాలలో నష్టాన్ని తగ్గించే వ్యూహాలను, విధానాలను రూపొందించుకోవాలని జి20 సదస్సు తీర్మానించింది. మహిళా రైతులు చేపట్టే ఆధునిక పద్ధతులను ప్రోత్సహించాలని తీర్మానించింది. మహిళలకు మరిన్ని ఉద్యోగావకాశాలు కల్పించాలని, వేతనాల చెల్లింపులో పురుషులు, మహిళల మధ్య వ్యత్యాసాన్ని తగ్గించాలని జి20 సదస్సు తీర్మానించింది.

హిందూమతంతో బిజెపికి సంబంధం లేదు

- అధికారం కోసం వారు దేనికైనా తెగిస్తారు
- పారిస్‌లో విద్యావేత్తలతో ముఖాముఖీలో రాహుల్



పారిస్ : బిజెపికి వాస్తవిక హిందూ మతానికి ఎటువంటి సంబంధమూ లేదని, అసలు వారికే ఆ పోలికలే లేవని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలన్నదే బిజెపి విధానమన్నారు. అందుకోసం వారు దేనికైనా తెగిస్తారని చెప్పారు. పారిస్‌లో విద్యావేత్తలు, విద్యార్థులతో శనివారం జరిగిన ముఖాముఖీ చర్చలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. 'భారతదేశ యొక్క ఆత్మ' అయిన సామ్యవాద, లౌకిక, ప్రజాతంత్ర, గణతంత్ర పరిరక్షణ కోసం పోరాడటానికి ప్రతిపక్షాలు కట్టుబడి ఉన్నాయన్నారు. దేశం 'ప్రస్తుత అల్లకల్లోలం' నుండి సమర్ధవంతంగా బయటపడుతుందని' ఆకాంక్షించారు. బిజెపి చెబుతున్న 'హిందూత్వ' విధానాలు వాస్తవ హిందూ మత గ్రంథాల్లో కానీ, ఇతిహాసాల్లో కానీ ఎక్కడా కనిపించదని ఆయన పేర్కొన్నారు.

'నేను భగవద్గీత చదివాను.. ఉపనిషత్తులు చదివాను, అనేక హిందూ పుస్తకాలు చదివాను కానీ.. బిజెపి చెబుతున్న 'హిందూ' వాటిల్లో లేదు' అని ఆయన పేర్కొన్నారు. 'మీ కంటే బలహీనమైన వ్యక్తులను భయభ్రాంతులకు గురిచేయాలని, హాని చేయాలని హిందూ సాహిత్యంలో ఎక్కడా లేదు, ఏ హిందూ పండితుడి వద్ద వినలేదు. కాబట్టి బిజెపి చేస్తున్నది హిందూ కాదు. వారు హిందూ జాతీయవాదులు కాదు. వారికి హిందూ మతంతో సంబంధం లేదు' అని చెప్పారు. బిజెపి వాళ్లు అధికారం కోసం ఏదైనా చేస్తారని చెప్పారు. గత ఎన్నికల్లో దేశంలోని ఓటర్లల్లో 60 శాతం మంది ప్రతిపక్ష పార్టీలకు ఓటేయగా, కేవలం 40 శాతం మంది అధికార పార్టీకి ఓటు వేశారని రాహుల్ గుర్తు చేశారు. 'కాబట్టి మెజారిటీ కమ్యూనిటీ బిజెపికి ఓటు వేస్తోందనేది తప్పుడు ఆలోచన' అని రాహుల్ స్పష్టం చేశారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ యూరప్ పర్యటనలో ఉన్నారు. ఇప్పటికే యూరోపియన్ పార్లమెంట్ సభ్యులతో సంభాషించిన సంగతి తెలిసిందే.

సుడాన్‌లో డ్రోన్ దాడి.. 40 మంది మృతి

ఖార్టూమ్ : సుడాన్ రాజధాని ఖార్టూమ్‌లో ఆదివారం ఒక బహిరంగ మార్కెట్‌పై జరిగిన డ్రోన్ దాడిలో 40 మందికి పైగా మరణించారు. సూడాన్‌లో అధికారం కోసం సైన్యం, పారామిలటరీ దళాల మధ్య కొన్ని నెలలుగా పోరాటం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం డ్రోన్ దాడి జరిగింది. డ్రాన్ దాడికి సైనిక వైమానిక దళమే కారణమని పారా మిలటరీ దళాలు ఆరోపిస్తున్నాయి. పారా మిలటరీ దళాలు సాధారణ ప్రజల ఇళ్లలో తిష్టవేసి సైన్యంపై దాడులకు పాల్పడుతుంది. దీంతో సైన్యం పౌరుల నివాసాలు, బహిరంగ ప్రదేశాలపై వైమానిక దాడులకు దిగుతుంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సుడాన్ సైన్యం-పారా మిలటరీ దళాల మధ్య పోరాటం జరుగుతుంది. ఈ పోరాటంలో ఇప్పటి వరకూ కనీసం 4 వేల మంది మరణించిఉంటారని ఆగస్టులో ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది.

బ్రెజిల్‌కు అధ్యక్ష బాధ్యత

(మొదటి పేజీ తరువాయి)

దేశాల సంఖ్య పెరుగుదలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఐక్యరాజ్యసమితిలో సభ్యదేశాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల సంఖ్య మారడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. 51 దేశాలతో ఐక్యరాజ్యసమితి ఏర్పడిన తొలి రోజుల్లో పరిస్థితులు వేరు అని పేర్కొన్న మోడీ ..ప్రస్తుతం సభ్యదేశాల సంఖ్య 200కు చేరువైన విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కాలానికి అనుగుణంగా ఎవరైతే మార్పు చెందరో ..వారు ప్రాముఖ్యాన్ని కోల్పోతారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఐదు సభ్యదేశాలు అమెరికా, రషా, చైనా, బ్రిటన్, ఫ్రాన్స్ మాత్రమే ఉన్నాయి. శాశ్వత సభ్యదేశాలను పెంచాలని భారత్ దీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే.

భద్రతా దళాల అదుపులో బైడెన్ కాన్వాయ్‌లోని డ్రైవర్

కాగా, బైడెన్ కాన్వాయ్‌లో ఓ డ్రైవర్‌ను శనివారం రాత్రి భద్రతా దళాలు అదుపులోకి తీసుకొన్నాయి. డ్రైవర్ కదలికలు అనుమానాస్పదంగా ఉండటంతో అతడిని దళాలు ప్రశ్నించాయి. బైడెన్ కాన్వాయ్‌లోని కొన్ని వాహనాలు అమెరికా నుంచి రాగా.. మరికొన్నింటిని భారత్‌లోనే కేటాయించారు. వీటిల్లో అద్దెకు తీసుకొన్న కారు ఒకటి ఉంది. బైడెన్ బసచేసే హెూటల్ ఐటిసి మౌర్యా వద్ద అది ఉండాల్సి ఉండగా.. యుఎఇ పాలకుడు అల్ నహ్యాన్ బస చేస్తున్న తాజ్ హెూటల్ వద్ద అది కనిపించింది. ఒక వ్యాపారవేత్తను అక్కడ డ్రాప్ చేసేందుకు తాను వచ్చానని ఆ డ్రైవర్ అధికారులకు చెప్పాడు. ప్రొటోకాల్ గురించి తనకు తెలియదన్నాడు. కొన్ని గంటలు ప్రశ్నించిన తర్వాత సంతృప్తి చెందిన భద్రతా దళాలు అతడిని వదిలిపెట్టాయి.

అంతులేని విషాదం

(మొదటి పేజీ తరువాయి)

చిక్కుకోవడం, భవన శిథిలాలు పేరుకుపోవడంతో సహాయక కార్యక్రమాలకు ఆటకంగా మారుతున్నాయి. రోడ్లపై పెద్ద పెద్ద రాళ్లు పోగుపడటంతో సహాయక బృందాలు సంఘటనాస్థలాలు, బాధితుల వద్దకు చేరుకోవడం ఆలస్యమవుతున్నదని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. భూకంపం నేపథ్యంలో మొరాకోకు సహాయం చేయడానికి అనేక దేశాలు ముందుకు వస్తున్నాయి.

రెండు దశాబ్దాల క్రితం మొరాకోతో సంబంధాలు తెంచుకున్న పొరుగు దేశం అల్జీరియా కూడా ఈ విపత్తు వేళ సహాయం చేయడానికి సిద్ధమైంది. తన మిలటరీని సహాయక చర్యల్లో పాల్గొనేందుకు పంపించింది. విద్రోహ చర్యలకు పాల్పడుతుందనే ఆరోపణలతో మొరాకోతో సరిహద్దులను అల్జీరియా మూసివేసింది. దీంతో 1994లోనే ఇరుదేశాల సరిహద్దులు మూతపడ్డాయి. 2021లో ఆకాశ మర్గాన్ని కూడా మూసివేశారు.

ఆ హక్కు తల్లిదండ్రులకు ఉంటుంది

- మద్రాస్ హైకోర్టు

చెన్నై : తల్లిదండ్రుల పోషణ, పిల్లలకు ఆస్తుల పంపకాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు చెప్పింది. తమ పోషణను సరిగ్గా పట్టించుకోకుంటే పిల్లలకు కేటాయించిన ఆస్తులను వెనక్కు తీసుకునే హక్కు తల్లిదండ్రులకు ఉంటుందని ఆ తీర్పులో తేల్చి చెప్పింది. పిల్లలకు ఆస్తుల పంపకాలపై తలెత్తిన కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పింది. 'ఒకవేళ పిల్లలు తమకు ప్రేమ, ఆప్యాయత సరిగ్గా పంచక పోతే తల్లిదండ్రులు తమ ఆస్తులను ఏకపక్షంగా వెనక్కి తీసేసుకోవచ్చు' అని జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం నేతృత్వంలోని బెంచ్ పేర్కొంది. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్ కింద తల్లిదండ్రులను పిల్లలు సంతృప్తి పర్చాల్సి ఉంటుందని వెల్లడించింది. 'ప్రేమ, ఆప్యాయతల కింద తల్లిదండ్రులు తమ పిల్లలకు గిఫ్ట్ లేదా సెటిల్‌మెంట్ డీడ్ రూపంలో ఆస్తులు ఇవ్వవచ్చు.

ఇందులో ఏ ఉల్లంఘన జరిగినా తల్లిదండ్రులు-సీనియర్ సిటిజన్స్ యాక్ట్ అమల్లోకి వస్తుంది. సబ్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఆదేశాల్లో ఎటువంటి బలహీనతలు లేవు' అని అని హైకోర్టు తెలిపింది. 'పెద్దల పట్ల మానవీయ కోణంలోనే వ్యవహరించాలన్నదే ఈ చట్టం ఉద్దేశం. సీనియర్ సిటిజన్ల భద్రత, గౌరవాన్ని రక్షించకపోతే ఈ చట్టం అమల్లోకి వస్తుంది' అని అని జస్టిస్ సుబ్రమణ్యం తెలిపారు.

లిఫ్ట్ కూలి.. ఆరుగురి మృతి

ముంబయి : మహారాష్ట్ర థానేలో ఆదివారం సాయంత్రం ఘోర ప్రమాదం జరిగింది. ఓ భవనంలో ప్రమాదవశాత్తు లిఫ్ట్ కూలిపోయింది. ఈ ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఘోడ్‌బందర్ రోడ్డులో ఉన్న భవనంలో ఈ ఘటన జరిగిందని థానే మున్సిపల్ కార్పొరేషన్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగం ఇన్‌చార్జి యాసిన్ తాడ్వి తెలిపారు. థానేలోని బల్కమ్ ప్రాంతంలో 40 అంతస్తుల రన్వాల్ ఎయిరిన్ భవనం లిఫ్ట్ కూలిపోవడంతో ఆరుగురు కార్మికులు మరణించారు.కొత్తగా నిర్మించిన భవనం పైకప్పుపై వాటర్‌ప్రూఫింగ్ పనులు జరుగుతున్నాయి. అయితే, పనులు ముగించుకుని కూలీలు కిందకు వస్తుండగా ఉన్న సమయంలో ఉన్నట్టుండి లిఫ్ట్ కూలిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడ్డ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.

అందరికీ ఆహార భద్రత... పోషకాహారం

- జి20 దేశాధినేతల ఉద్ఘాటన
- సదస్సులో తీర్మానానికి ఆమోదం

న్యూఢిల్లీ : ఆకలిని, పోషకాహార లోపాన్ని పాలద్రోలే విషయంలో ధృఢ చిత్తంతో ఉన్నామని జి20 దేశాధినేతలు గొప్పగా ఉద్ఘాటించారు. ఆహారం, ఇంధనం సహా నిత్యావసరాల ధరలు పెరగడంతో ప్రజల జీవన ప్రమాణాలపై ఒత్తిడి ఏర్పడుతోందని అంటూ ప్రపంచ వ్యాప్తంగా అందరికీ ఆహార భద్రత కల్పించేందుకు, పోషకాహారాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఈ మేరకు ఆదివారం ముగిసిన జి20 సదస్సులో ఒక డిక్లరేషన్ ఆమోదించారు. పేదరికం, అసమానతలు, వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాలు, ఘర్షణలు వంటి పరిణామాలు మహిళలు, చిన్నారులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయని డిక్లరేషన్ అభిప్రాయపడింది.


'ఉక్రెయిన్ యుద్ధం, దాని ప్రభావం కారణంగా ప్రజలు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఆహార, ఇంధన భద్రతకు ముప్పు వాటిల్లింది. సరఫరాలు నిలిచిపోయాయి. ఆర్థిక అస్థిరత ఏర్పడింది. ద్రవ్యోల్బణం పెరిగింది. అభివృద్ధి నిలిచిపోయింది. ఈ పరిణామాలు సభ్య దేశాలలో విధానపరమైన వాతావరణాన్ని సంక్లిష్టం చేశాయి. ముఖ్యంగా కోవిడ్ మిగిల్చిన నష్టాల నుండి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వర్ధమాన, పేద దేశాలపై ఎక్కువగా ప్రభావం పడింది. ఆర్థిక విధ్వంసం అభివృద్ధిని కుంటుపరచింది' అని డిక్లరేషన్ వివరించింది.

రష్యా ఆహార ఉత్పత్తులు, ఎరువులు ప్రపంచ మార్కెట్‌కి చేరడంలో తుర్కియే, ఐరాస మధ్యవర్తిత్వంలో కుదిరిన ఒప్పందాలు చేసిన కృషిని కొనియాడింది. ఉక్రెయిన్ నుండి ఆహారధాన్యాలు సురక్షితంగా రవాణా అయ్యేందుకు కూడా ఈ ఒప్పందాలు ఉపకరించాయని తెలిపింది. రష్యా, ఉక్రెయిన్‌ల నుండి ఆహార ధాన్యాలు, ఆహార పదార్థాలు, ఎరువులు వంటివి పూర్తి స్థాయిలో, సకాలంలో సరఫరా జరగడంతో వర్ధమాన దేశాలు, ఆఫ్రికా వంటి పేద దేశాల అవసరాలు తీరాయని వివరించింది.

అందరికీ ఆహార భద్రత, పోషకాహారం అందించేందుకు జి20 సదస్సు ఆరు సూత్రాల కార్యక్రమాన్ని రూపొందించింది. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకొనే, పోషకాహారాన్ని అందించే పంటలపై పరిశోధనల్లో సహకారాన్ని మరింత పటిష్టపరచుకోవాలని పిలుపునిచ్చింది. స్థానికంగా ఎరువుల ఉత్పత్తిని పెంచాలని, భూ ఆరోగ్యాన్ని మెరుగుపరచాలని సూచించింది. వ్యవసాయ ఉత్పాదకతను పెంచి ఆహార నష్టాన్ని, వృథాను తగ్గించేందుకు ఆధునీకరణ పద్ధతులు, పెట్టుబడులపై దృష్టి సారించాలని అభిప్రాయపడింది. ఆహార భద్రతా సవాళ్లను ఎదుర్కోవడంలో వర్ధమాన దేశాలకు చేయూత అందించాలని నిర్ణయించింది. ఆహార, ఇంధన ధరలు గరిష్ట స్థాయి నుండి పడిపోవడంతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత ఏర్పడిందని జి20 సదస్సు తెలిపింది. ఈ సంవత్సరాంతానికి వ్యవసాయాభివృద్ధి వనరుల కోసం అంతర్జాతీయ నిధిని పరిపుష్టం చేయాలని నిర్ణయించింది.

'జాతీయ విపత్తు'గా హిమాచల్ వరదలు

- ప్రధానికి సిఎం సుఖు వినతి



న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్ ఎదుర్కొంటున్న వరదలను జాతీయ విపత్తును ప్రకటించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుఖు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత వర్షాకాలంలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడ్డం, పిడుగులు పడ్డం వంటి సంఘటనలతో రూ. 12 వేల కోట్ల నష్టాన్ని రాష్ట్రం చవిచూస్తున్నందున జాతీయ విపత్తుగా ప్రకటించాలని కోరారు. న్యూఢిల్లీలో జరుగుతున్న జి-20 సదస్సు సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన విందుకు హాజరైన ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ ప్రధానితో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వర్షాల కారణంగా ఇప్పటి వరకూ 400 మందికి పైగా మరణించారని, 13 వేలకు పైగా ఇళ్లు నాశనమయ్యాయని, వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని మోడీకి తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ పునర్నిర్మాణానికి కేంద్రం విశేష సహాయం అందించాలని కోరారు.

వాంగ్మూలాల నమోదుకు మేజిస్ట్రేట్‌ల నియామకం

ఇంఫాల్ : మణిపూర్‌లో జాతి హింసకు సంబంధించి సిబిఐ విచారిస్తున్న 27 కేసుల్లో సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసేందుకు మణిపూర్ హైకోర్టు 13 మంది మేజిస్ట్రేట్‌లను నియమించింది. మణిపూర్ రాష్ట్రంలోని మొత్తం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని, వారి ప్రాదేశిక అధికార పరిధితో సంబంధం లేకుండా వారు(మేజిస్ట్రేట్‌లు) స్టేట్‌మెంట్‌లను రికార్డ్ చేస్తారని హైకోర్టు వివరించింది. ఆగస్టు 25న సుప్రీంకోర్టు వెలువరించిన ఆదేశాలకు అనుగుణంగానే హైకోర్టు తాజా నోటిఫికేషన్ వెలువడింది. సిబిఐ కేసుల్లో తమ పనిని ఎలా ప్రారంభించాలనే దానిపై మణిపూర్ హైకోర్టు నుంచి తదుపరి సూచనల కోసం వేచి ఉండటంతో పాటు, ఈ న్యాయమూర్తులు స్థానికంగా దర్యాప్తు చేస్తున్న 6,000 కేసులలో కూడా సెక్షన్ 164 ప్రకారం స్టేట్‌మెంట్‌లను నమోదు చేయడంలో పెద్దగా పురోగతి లేదని కోర్టు పేర్కొన్నది.

పవర్ పాయింట్ సృష్టికర్త అస్టిన్ మృతి



న్యూయార్క్ : విశేష ప్రాచుర్యం పొందిన పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ సహసృష్టికర్త డెన్నిస్ అస్టిన్ (76) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతున్న అస్టిన్ కాలిఫోర్నియాలో మరణించారని ఆయన కుమారుడు మైఖేల్ అస్టిన్ మీడియాకు వెల్లడించారు. ఎంఐటిలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన అస్టిన్ ఫోర్‌థాట్‌లో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేశారు.

టెక్నాలజీ రంగంలో విశేష సేవలందించిన అస్టిన్ పవర్‌పాయిట్ కో డెవలపర్‌గా గుర్తింపు పొందారు. ఫోర్‌థాట్‌కు చెందిన రాబర్ట్ గస్కిన్స్‌తో కలిసి అస్టిన్ పవర్‌పాయింట్‌పై పనిచేశారు. ఫోర్‌థాట్ సంస్థను తరువాత మైక్రోసాఫ్ట్ కొనుగోలు చేసింది. 1985 నుంచి 1996లో రిటైరయ్యే వరకూ పవర్‌పాయింట్ ప్రైమరీ డెవలపర్‌గా అస్టిన్ సేవలందించారు. 1993 నాటికి పవర్‌పాయింట్ ఏకంగా పది కోట్ల సేల్స్ నమోదు చేసింది.

ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పవర్‌పాయింట్‌ను సులభంగా నిర్వహించేలా అస్టిన్ సరళతరం చేశారు. కేవలం స్లైడ్స్ కాకుండా ప్రెజెంటేషన్స్‌ను పకడ్బందీగా ఇచ్చేలా పవర్‌పాయింట్ ప్రెజెం టేషన్‌ను అస్టిన్ డెవలప్ చేశారు. అస్టిన్ పవర్‌పాయింట్‌ను డిజైన్ చేయకుంటే దాని గురించి ఏ ఒక్కరూ వినిఉండేవారు కాదని, అది ఇంతగా ప్రాచుర్యం పొందేదని కాదని తన పుస్తకంలో గస్కిన్స్ రాసుకొచ్చారు. పవర్‌పాయింట్‌పై ప్రతిరోజూ 5 కోట్ల ప్రెజంటేషన్స్ క్రియేట్ అవుతున్నాయి. కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లు, బిజినెస్ స్కూల్స్, ప్రొఫెసర్లు, మిలటరీ జనరల్స్ ఈ సాఫ్ట్‌వేర్‌ను విరివిగా వాడుతున్నారు.

శాంతి కోసం పనిచేయండి లేదా రాజీనామా చేయండి

- కుకీ-జో ఎమ్మెల్యేలకు సిఎం అల్లుడి హుకుం

ఇంఫాల్ : మణిపూర్‌లో శాంతి కోసం ఐక్యంగా పని చేయాలని పది మంది కుకీ-జో ఎమ్మెల్యేలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ అల్లుడు, అధికార బిజెపి ఎమ్మెల్యే రాజ్‌కుమార్ ఇమో సింగ్ కోరారు. రాష్ట్రం నుంచి విడిపోవాలనే తమ డిమాండ్‌ను ముందుకు తీసుకురావాలంటే మాత్రం వారు తమ పదవులకు రాజీనామా చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గతంలో కాంగ్రెస్‌లో ఉన్న రాజ్‌కుమార్ ఇమో సింగ్.. 2021లో బిజెపిలో చేరారు. ప్రస్తుతం ఆయన పోస్టు రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. కాగా, రాష్ట్రంలోని 10 మంది కుకీ-జో ఎమ్మెల్యేలలో ఏడుగురు బిజెపి ఎమ్మెల్యేలే కావటం గమనార్హం. వారిలో ఇద్దరు మంత్రులు ఉన్నారు. రాష్ట్రంలో జాతుల మధ్య హింస చెలరేగిన అనంతరం ఈ 10 మంది కుకీ-జో ఎమ్మెల్యేలు ఇంఫాల్‌కు దూరంగా ఉన్నారు. రాష్ట్రంలో మే 3న చెలరేగిన హింస ఇప్పటికీ కొనసాగుతున్నది. దాదాపు నాలుగు నెలలకు పైగా రాష్ట్రంలో అశాంతి కొనసాగుతున్నది. ఇప్పటి వరకు కనీసం 179 మంది మరణించారు. 67 వేల మందికి పైగా నిరాశ్రయులయ్యారు.



రాజమహేంద్రవరం సెంట్రల్ జైలువద్ద మోహరించిన పోలీసులు

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు చంద్రబాబు

- భారీ పోలీస్ బందోబస్తు మధ్య తరలింపు
- స్నేహ బ్యారెక్ కేటాయింపు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

విజయవాడలోని ఎసిబి కోర్టు నుంచి ఏలూరు బైపాస్ రోడ్డు మీదుగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు అత్యంత కట్టుదిట్టమైన భద్రత మధ్య చంద్రబాబును సిఐడి పోలీసులు భారీ వర్షంలో తరలించారు. ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట పదిహేను నిమిషాలకు ఆయన కాన్వాయ్ రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్‌కు చేరుకుంది. లోకేష్ వేరొక వాహనంలో సెంట్రల్ జైల్‌కు చేరుకున్నారు. కాన్వాయ్‌ని ఎవరూ అడ్డుకోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. కాన్వాయ్‌కు ముందుగా పైలట్ వాహనాల్లో వెళ్లి ఆ మార్గంలో ఎటువంటి అవరోధాలూ లేకుండా చేశారు. రాజమండ్రిలో సెక్షన్ 30, తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 144 అమలులోకి తెచ్చారు. రాజమండ్రి సిటీ వ్యాప్తంగా 36 పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు. జైలు వద్ద 300 మందితో బందోబస్తు నిర్వహించారు. సెంట్రల్ జైలు రోడ్డును మూడు కిలోమీటర్ల మేర తమ ఆధీనంలోకి తీసుకున్నారు. చంద్రబాబు కోసం స్నేహ బ్యారెక్‌ను జైలు అధికారులు కేటాయించారు. జైలులో ప్రత్యేక భద్రతా ఏర్పాటు చేశారు. ఆయనకు రిమాండ్ ప్రిజనర్ (ఆర్‌పి) నంబర్ 7691 కేటాయించినట్లు తెలిసింది. రాజమహేంద్రవరం టిడిపి రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చెయ్యచౌదరి, ఆదిరెడ్డి భవానిలను, ముఖ్యనాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

చంద్రబాబుకు రిమాండ్

(మొదటి పేజీ తరువాయి)

ఉద్విగ్నతకు లోనయ్యారు. ఎపిలో అవినీతి ఆరోపణలతో రిమాండుకు గురైన తొలి మాజీ సిఎం చంద్రబాబే.

కస్టడీకి ఇవ్వాలని సిఐడి పిటీషన్

చంద్రబాబుకు జ్యుడీషియల్ రిమాండు విధించిన వెంటనే ఆయనను పోలీసు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎసిబి కోర్టులో సిఐడి తరుపు న్యాయవాదులు పిటీషన్ దాఖలు చేశారు.

పిటీషన్‌ను పరిశీలించిన న్యాయమూర్తి సోమవారం దీనిపై విచారణ జరుపుతామని తెలిపారు. అలాగే కౌంటర్ దాఖలు చేయాలనీ సూచించారు.

నేడు బంద్‌కు టిడిపి పిలుపు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి సోమవారం రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చింది. చంద్రబాబు అక్రమ అరెస్టు, ఆ సందర్భంలో నిరసన తెలిపిన పార్టీ శ్రేణులపై జరిగిన పోలీసు దమనకాండ, జగన్ కక్షపూరిత రాజకీయాలకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా బంద్ చేపట్టాలని నిర్ణయించామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఇదిలావుండగా రాష్ట్ర ప్రజలకు లోకేష్ లేఖ రాశారు. 'రాజకీయ పగలు, కక్షలకు హద్దులు లేవా? మా నాన్న పోరాట యోధుడు.. నేనూ అంతే... ఈ యుద్ధంలో నాతో కలిసి రావాలి' అంటూ ఆయన తన లేఖలో పేర్కొన్నారు.



మీకోసం

బల్బుమీద సెంటు చల్లితే, ఆ బల్బు వేసినప్పుడు గది అంతా మంచి సువాసనగా ఉంటుంది.

జీవన సౌరభం

అడిగి తెలుసుకోవడానికి భయపడేవారు నేర్చుకోవడంలో వెనకబడతారు.

చందమామ

చుక్కల రేడును కలిసాము
చక్కని లోకము చూసాము
'దక్షిణ' చెక్కిలి ముద్దాడి
విజయాన్నే సాధించాము



ప్రతిభను మనము చూపాము
ప్రగతికి బాటలు వేసాము
వెన్నెల తరగల రాజును చేరి
మనమంతా పులకించాము

శోధనకు తెర తీసాము
కలలను నిజము చేసాము
ప్రపంచాన మన దేశాన్ని
అగ్ర పథాన నిలిపాము

పరాజయాలు పొందాము
పాఠాలు నేర్చుకున్నాము
విరామమెరుగక విక్రమిస్తే
విజయము మనదని చాటాము

ఖనిజాల నిల్వలను
అన్వేషించి తీసెదము
చందమామపై ఆవాసం
నిజం చేసి చూపిస్తాము

జాబిల్లిని ముద్దాడి
జగతిన మనము గెలిచాము
రాత్రి పగలు కష్టపడి
చరిత్రనే సృష్టించాము

- రావిపల్లి వాసుదేవరావు
94417 13136

తేడాలు కనిపెట్టండి





పిల్లలూ, ఒకేలా కనిపిస్తున్న ఈ బొమ్మల్లో ఐదు తేడాలు ఉన్నాయి. కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ





మ(క్రి. త్రివేణి
9వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ముత్యాలపేట కవిటి మండలం
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బిడ్డల బరువుపై వాయు కాలుష్య ప్రభావం!

గాలి కాలుష్యం వల్ల కలిగే అనర్థాల గురించి ఎప్పుడూ వింటూనే ఉంటాం. తాజా నివేదికలో మరో విస్తుపోయే విషయమొకటి వెలుగుచూసింది. పచ్చని ప్రకృతి ఒడిలో ఆహ్లాదకర వాతావరణంలో నివసించే మహిళలు ప్రసవించే బిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో తగిన బరువుతో ఉంటున్నారు. కాలుష్య కారక ప్రాంతాల్లో నివసించే మహిళలకు జన్మించే బిడ్డలు మాత్రం తక్కువ బరువుతో పుడుతున్నారని తాజా సర్వే స్పష్టం చేసింది. సెప్టెంబరు 9 నుండి 13 వరకు ఇటలీ, మిలాన్‌లో జరిగే 'యూరోపియన్ రెస్పిరేటరీ ఇంటర్నేషనల్ కాంగ్రెస్'లో ఈ నివేదికను సమర్పించనున్నారు. కాలుష్య రహిత ప్రాంతాల్లో జన్మించే బిడ్డలు తగిన బరువుతో పుడుతున్నారని, ఇది, భవిష్యత్తులో కూడా కాలుష్య కారక ప్రభావాలను ఎదుర్కొనడానికి వారిని సిద్ధం చేస్తుందని సర్వేలో స్పష్టమైంది.



పుట్టుకకు, ఊపిరితిత్తుల ఆరోగ్యానికి మధ్య సంబంధం ఏంటని ఆశ్చర్యంగా ఉండొచ్చు. కానీ ఇది వాస్తవమని సర్వే చెబుతోంది. అంతేకాదు, తక్కువ బరువుతో పుట్టిన పిల్లల్లో ఆస్తమా, క్రానిక్ అబ్‌స్ట్రక్టివ్ పల్మనరీ డిసీజెస్ (సిఒపిడి) ఎక్కువ ప్రభావం చూపుతుందని పరిశోధకులు స్పష్టం చేశారు. అభివృద్ధి పేరుతో నగరాలను కాలుష్య కారకాలుగా తయారుచేయ వద్దని, పట్టణాల్లో వాయు కాలుష్యాన్ని తగ్గించి పచ్చని వాతావరణం ఉండేలా చేయాలని సూచిస్తున్నారు.

అధ్యయనం ఇలా ...



ఈ పరిశోధనలో యూరప్‌లోని డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఐస్‌లాండ్, ఎస్టోనియా దేశాల్లో నివసిస్తున్న 4,286 మంది పిల్లలు, వారి తల్లులను భాగస్వామ్యం చేశారు. ఉత్తర ఐరోపాలోని శ్వాసకోశ ఆరోగ్య అధ్యయనం నుండి ఈ సర్వే సేకరించారు. దీన్ని నార్వేలోని బెర్గెన్ విశ్వవిద్యాలయం(యుఐబి) పరిశోధకుడు రాబిన్ మజాటి సిన్సమల అందించారు. గర్భధారణ సమయంలో మహిళలు నివసించిన ప్రాంతాలను కూడా ఈ సర్వేలో అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా పచ్చదనం, కాలుష్యకారక సాంద్రతలను అంచనా వేశారు. యూరోపియన్ యూనియన్ ప్రమాణాల ప్రకారం నైట్రోజన్ డైఆక్సైడ్, ఓజోన్, బ్లాక్ కార్బన్, పార్టిక్యులేట్ మ్యాటర్‌లో రెండు రకాలైన పిఎం2.5, పిఎం10ల వాయు కాలుష్య సగటు స్థాయిల డేటాను కూడా పరిగణనలోకి తీసుకున్నారు.

ఈ సమాచారాన్ని నవజాత శిశువుల జనన బరువుతో పరిశోధకులు సరిపోల్చారు. ధూమపానం లేక ఏదైన ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లుల వయసు వంటి జనన బరువును ప్రభావితం చేసే అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.

జనన బరువులో తేడాలు స్పష్టం

అధికస్థాయి వాయుకాలుష్యం బిడ్డల జనన బరువుతో ముడిపడి ఉందని, చిన్న రేణువులతో కూడిన పిఎం2.5, సాపేక్షంగా పెద్ద కాలుష్య కణాలు పిఎం10, నైట్రోజన్ డై ఆక్సైడ్, బ్లాక్ కార్బన్‌ల స్థాయిలు, 56 గ్రాములు, 46 గ్రాములు, 48 గ్రాముల సగటు తగ్గింపులతో జనన బరువును ప్రభావితం చేసిందిన పరిశోధకులు కనుగొన్నారు.


అలాగే పచ్చదనాన్ని కేంద్రంగా తీసుకున్నప్పుడు జనన బరువులో తేడా స్పష్టంగా కనిపించింది. వాయు కాలుష్య ప్రభావం వున్న ప్రాంతాల్లో కంటే పచ్చగా ఉన్న ప్రాంతాల్లో నివసించిన తల్లులు ప్రసవించిన బిడ్డల జనన బరువు 27 గ్రాములు హెచ్చుగా రికార్డు అయ్యింది.

'గర్భంలో ఉండగానే పిల్లల ఊపిరితిత్తుల అభివృద్ధి చాలా కీలకం. తక్కువ బరువు ఉన్న పిల్లలు ఛాతీ ఇన్ఫెక్షన్లకు గురవుతారని మాకు తెలుసు. ఇది ఆస్తమా, సిఒపిడి వంటి సమస్యలకు దారి తీస్తుంది' అని సిన్సమల అంటున్నారు. అలాగే 'వాయు కాలుష్యం తక్కువ బరువు ఉన్న పిల్లల జననాలకు దారి తీస్తుందని మా అధ్యయనం తేటతెల్లం చేస్తోంది. కాబట్టి పచ్చటి వాతావరణంలో నివసించడం ద్వారా ఈ ప్రభావాన్ని ఎదుర్కొనవచ్చ'ని ఆయన సూచిస్తున్నారు.

పట్టణాలలో మొక్కలు పెంచడం వల్లే కాలుష్యం తగ్గదు. ట్రాఫిక్ సమస్యను కూడా నియంత్రించాలి. వాహనాలు వదిలిన పొగ కారణంగా కాలుష్యమైన వాతావరణాన్ని పచ్చని మొక్కలు కొంతవరకు సహాయపడతాయి. అటువంటి వాతావరణంలో నివసిస్తున్న గర్భిణీలు మానసికంగా ఉత్సాహంగా ఉంటారు. వారి శరీరం చురుకుగా ఉంటుందని పరిశోధకులు అంటున్నారు.

యూరోపియన్ దేశాల్లో చేసిన ఈ తాజా అధ్యయనం ప్రపంచ దేశాలకు ఓ గుణపాఠం నేర్పాలి. ముఖ్యంగా అభివృద్ధి పేరుతో పరిశ్రమలు, వాహనాలు, ఇతర హానికర వాయువుల వినియోగం మనదేశంలో విరివిగా పెరిగిపోతోంది. ఇటీవలే ప్రపంచంలోనే అత్యధిక కాలుష్యనగరంగా దేశరాజధాని ఢిల్లీ రికార్డులకెక్కింది. ఈ పరిణామం రాబోయే తరాలను తీవ్రంగా ప్రభావం చూపుతుంది. పుట్టుక నుండే వారి ఆరోగ్యం దెబ్బతిని భావితరాలు భవిష్యత్తు అంధ:కారమౌతుంది. ఈ హెచ్చరికలను కొట్టిపారేయకుండా సీరియస్‌గా పట్టించుకుని ఆరోగ్యకర వాతావరణంలో బిడ్డల జననాలు ఉండేలా కృషి చేయాలి. పాలకులు, ప్రభుత్వాలు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

తమలపాకుతో ఆరోగ్యానికి మేలు



ఈ కాలంలో విరివిగా దొరికే తమలపాకులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు అంటున్నారు. తమలపాకులోని ఔషధ గుణాలు అన్ని రకాల సమస్యల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. తమలపాకులో శరీరానికి అవసరమైన విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రైబోఫ్లావిన్, బీటా కెరోటిన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్, కాపర్, ఫాస్పరస్, ఐరన్ వంటి పలు పోషకాలు ఉన్నాయి.

- తమలపాకులోని ఔషధ గుణాలు దగ్గు, బ్రాంకైటిస్, ఉబ్బసం వంటి శ్వాసకోశ వ్యాధుల చికిత్సలో ఉపయోగపడతాయి. తమలపాకులను నమలడం వల్ల ఔషధ గుణాలు నేరుగా శరీరానికి లభించి ఆయా సమస్యలను దూరం చేస్తాయి.
- తమలపాకులోని యాంటీ హైపర్‌గ్లైసీమిక్ లక్షణాలు రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచడానికి సహాయ పడతాయి.
- ఒత్తిడి, ఆందోళన సమస్యలకు తమలపాకులతో ఉపశమనం పొందవచ్చు.
- తమలపాకులలోని ఫినాలిక్ సమ్మేళనాలు శరీరం నుంచి కాటెకోలమైన్‌లు అనే ఆర్గానిక్ సమ్మేళనాలను విడుదల చేయడం వల్ల మనసుకు ఆహ్లాదంగా ఉంటుంది.
- భోజనం తర్వాత తమలపాకును తినడం వల్ల నోటి దుర్వాసన, పసుపు దంతాలు, దంత క్షయం సమస్యలు దూరం అవుతాయి.
- తమలపాకులు జీర్ణ సమస్యలను తగ్గిస్తాయి. మలబద్ధకం, అజీర్తి, కడుపు మంట, ఎసిడిటీ వంటి జీర్ణ సమస్యలు దూరం అవుతాయి.

'సైమా'లోనూ సత్తా చాటేనా?

దక్షిణాది సినీ ఇండస్ట్రీలో ప్రతిష్టాత్మకంగా భావించే 'సైమా' (సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) 2023 వేడుకలు ఈనెల 15,16 తేదీల్లో దుబాయ్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్లో జరగనున్నాయి. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సినీ రంగానికి సంబంధించిన భారతదేశం మొత్తంలో చాలా రకాల పురస్కారాలను అందిస్తున్నారు. అందులో సౌత్ ఇండియాలో ఉన్న సినీ పరిశ్రమలకు చెందిన చిత్రాలు, నటులు, సాంకేతిక నిపుణుల్లోని నైపుణ్యతను వెలికి తీసి ఇచ్చేందుకు తీసుకొచ్చిన ప్రతిష్టాత్మక అవార్డులే సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ (సైమా). గత 11 సంవత్సరాలుగా ఈ వేడుకలు వేర్వేరు ప్రాంతాల్లో ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది ఈ అవార్డుల వేడుక రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం ఇండస్ట్రీలకు చెందిన వారికి ఈ వేడుకల్లో పురస్కార ప్రదానం చేస్తుంటారు. మొదటి రోజు తెలుగు, కన్నడ, రెండో రోజు తమిళం, మలయాళం ఇండస్ట్రీలకు సంబంధించిన అవార్డుల ప్రకటన ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని దక్షిణ భారతదేశంలోని పేరున్న ఇద్దరు ప్రముఖ నటులు అందజేసే అవకాశం ఉంది. అవార్డులకు స్పాన్సర్‌గా ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ నెక్సా వ్యవహరించనుంది. ప్రతిసారీ సైమా వేడుకలు నటీనటుల డ్యాన్సులు, స్కిట్‌లతో ఎంతో కోలాహలంగా జరుగుతాయి. ఈసారి కూడా ప్రేక్షకులకు అదేస్థాయిలో వినోదాన్ని అందించేందుకు సైమా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. హీరోయిన్లు శ్రీలీల, మృణాల్ ఠాకూర్ సైమా వేదికపై డ్యాన్సు చేయనున్నారు.

టాలీవుడ్‌లో ఎన్‌టిఆర్, రామ్‌చరణ్ మధ్యే పోటీ?

తెలుగు సినిమా విభాగం నుంచి ఉత్తమ నటుల నామినేషన్స్‌లో ఆర్‌ఆర్‌ఆర్ నుంచి జూనియర్ ఎన్టీఆర్, రామ్ చరణ్‌తో పాటు అడివి శేష్ (మేజర్), నిఖిల్ (కార్తికేయ ,దుల్కర్ సల్మాన్ (సీతారామం), సిద్ధు జొన్నలగడ్డ (డిజె టిల్లు) పోటీలో ఉన్నారు. ఈ జాబితాలో ఎంతమంది ఉన్నా.. ప్రధానంగా ఆర్‌ఆర్‌ఆర్ హీరోల మధ్య మాత్రమే పోటీ ఉంటుందని ఊహాగానాలు వస్తున్నాయి. ఇప్పుడు వీరిద్దరిలో ఎవరు అవార్డ్‌ను దక్కించుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

ఉత్తమ సినిమా విభాగంలో...

తెలుగులో బెస్ట్ మూవీ విభాగంలో ఆర్‌ఆర్‌ఆర్, డీజే టిల్లు, కార్తికేయ2, మేజర్, సీతా రామమ్ చోటు దక్కించుకున్నాయి. ఆర్‌ఆర్‌ఆర్ 11, సీతారామం 10 కేటగిరీల్లో పోటీపడ్డాయి. తమిళంలో పొన్నియిన్ సెల్వన్-1, విక్రమ్, లవ్ టుడే, తిరుచిత్రంబలం, రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్ చిత్రాలు బెస్ట్ మూవీ కేటగిరీలో పోటీపడుతున్నాయి. వీటిలో మణిరత్నం పొన్నియిన్ సెల్వన్ -1 10 విభాగాల్లో, కమల్ హాసన్ విక్రమ్ 9 విభాగాల్లో నామినేషన్లు దక్కించుకున్నాయి. కన్నడలో కాంతార, కేజీయఫ్-2, 777 చార్లీ, లవ్ మాక్‌టెయిల్ 2, విక్రాంత్ రోనా సినిమాలు ఉత్తమ చిత్రం విభాగంలో పోటీ పడుతున్నాయి. వాటిలో కాంతార, కేజీయఫ్-2 చిత్రాలు ఏకంగా 11 కేటగిరిల్లో నామినేషన్లు దక్కించుకొని సత్తా చాటాయి. మలయాళ ఇండస్ట్రీ నుండి భీష్మ పర్వం, తల్లుమాల, హృదయం, జయ జయ జయ హే, జన గణ మన, న్నా తాన్ కేస్ కొడుకు వంటి చిత్రాలు ఉత్తమ చిత్రం కేటగిరీలో పోటీ పడుతున్నాయి. వాటిలో భీష్మపర్వం చిత్రానికి 8, థల్లుమాల మూవీకి 7 నామినేషన్లు దక్కాయి.

ఉత్తమ సంగీత దర్శకులు, సహాయ నటులు ఎవరో..?

ఉత్తమ సంగీత దర్శకులు, ఉత్తమ సహాయ నటుల కేటగిరీలో కూడా పలువురు పోటీపడుతున్నారు. టాలీవుడ్ నుంచి ఎం.ఎం. కీరవాణి (ఆర్‌ఆర్‌ఆర్), భీమ్స్ సిసిరోలియో (ధమాకా), విశాల్ చంద్రశేఖర్ (సీతారామం) , తమన్ (భీమ్లానాయక్), శ్రీచరణ్ పాకాల (డీజే టిల్లు) ఉత్తమ సంగీత దర్శకుడి బరిలో నిలిచారు. 'బెస్ట్ యాక్టర్ ఇన్ ఏ సపోర్టింగ్ రోల్' కేటగిరీలో మురళీధర్ గౌడ్ (డీజే టిల్లు), నరేశ్ (అంటే సుందరానికీ!), రానా (భీమ్లానాయక్), రావు రమేే(ధమాకా), సుమంత్ (సీతారామం)లకు నామినేషన్లు దక్కాయి. అమల (ఒకే ఒక జీవితం), ప్రియమణి (విరాటపర్వం), సంయుక్త (భీమ్లానాయక్), సంగీత (మసూద), శోభిత (మేజర్) 'బెస్ట్ యాక్ట్రెస్ ఇన్ ఏ సపోర్టింగ్ రోల్' విభాగంలో పోటీ పడుతున్నారు.

గతేడాది 'పుష్ప' జోరు...

గతేడాది అక్టోబర్‌లో జరిగిన సైమా అవార్డుల్లో టాలీవుడ్ సినిమా 'పుష్ప: ది రైజ్' జోరు కనబర్చింది. ఆరు విభాగాల్లో అవార్డులు గెలుచుకుంది. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు కేటగిరీల్లో అవార్డులు కైవసం చేసుకుంది. 2023 నామినేషన్లలో ఆర్‌ఆర్‌ఆర్, సీతారామం హవా కొనసాగింది.

పండుగలా వేడుకలు
సైమా ఛైర్ పర్సన్ బృందా ప్రసాద్

దుబాయ్‌లో జరగబోయే సైమా వేడుకలను వైభవంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నాం. టాలీవుడ్ స్టార్ హీరో రానా దగ్గుబాటి, హీరోయిన్లు నిధి అగర్వాల్, మీనాక్షి చౌదరి, మారుతి సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శశాంక్ శ్రీవాస్తవ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. "సైమా అంటే సౌత్ ఇండియా ఫిల్మ్ ఇండస్ట్రీస్ అన్నీ కలిసి జరుపుకునే వేడుక. గత 11 ఏళ్లుగా నేను ఈ వేడుకల్లో భాగమవుతున్నాం. ప్రతీసారి కొత్తగా మొదలుపెట్టిన ఉత్సాహం, సంతోషం కలుగుతోంది. ఓ మంచి వేదికని ఏర్పాటు చేసి.. కళలపై ఒకే రకమైన అభిరుచి ఉన్న అందరినీ ఒకచోటకి చేర్చడంలో సైమా విజయవంతమైంది. అవార్డులు ఎవరికి వస్తే బాగుంటుందనే అంశం కంటే.. ఎంత ఎక్కువ మంది నటీనటులు ఈ వేడుకల్లో పాల్గొంటే అంత బాగుంటుందనేది అభిప్రాయం వ్యక్తంచేశారు. గొప్ప నటులతో కలిసి వేదిక పంచుకోవడం ఆనందాన్నిస్తుంది. అని బృందా ప్రసాద్ తెలిపారు.

క్వీన్ కొకో గాఫ్

- యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫైనల్లో 19 ఏళ్ల టీనేజర్ సంచలనం

న్యూయార్క్ : 19 ఏళ్ల అమెరికా యువ సంచలనం, మహిళల సింగిల్స్ సర్క్యూట్ నయా స్టార్ కొకో గాఫ్ యుఎస్ ఓపెన్ చాంపియన్‌గా అవతరించింది. టైటిల్ పోరులో రెండో సీడ్, వచ్చే వారం వరల్డ్ నం.1 ర్యాంక్ అందుకోనున్న బెలారస్ భామ సబలెంకపై మూడు సెట్ల మహా పోరులో కొకో గాఫ్ ఘన విజయం సాధించింది. రెండు గంటలకు పైగా సాగిన టైటిల్ ఫైట్‌లో 2-6, 6-3, 6-2తో కొకో గాఫ్ పైచేయి సాధించింది. 1999లో సెరెనా విలియమ్స్ 17 ఏండ్ల ప్రాయంలోనే యుఎస్ ఓపెన్ విజేతగా అవత రించి నయా చరిత్ర సృష్టించగా.. తాజాగా ఆమె సరసన కొకో గాఫ్ నిలిచింది. మహిళల సింగిల్స్ ఫైనల్. ప్రత్యర్థి రెండో సీడ్, త్వరలో వరల్డ్ నం.1 కానున్న సబలెంక. సమీకరణాలు సబలెంకకు అనుకూలం. అందుకు తగినట్టుగానే తొలి సెట్‌లో కొకో గాఫ్ పరాజయం పాలైంది. తొలి సెట్‌లో మూడు సార్లు గాఫ్ సర్వ్‌ను బ్రేక్ చేసిన సబలెంక.. అలవోకగా 6-2తో తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. దీంతో, సబలెంక గెలుపు లాంఛనమే అనిపించింది. కానీ రెండో సెట్‌లో కొకో గాఫ్ తన గేమ్ బయటపెట్టింది. వరల్డ్ క్లాస్ డిఫెన్స్‌తో చెలరేగిన గాఫ్.. రెండో సీడ్ సబలెంకను ఇరకాటంలో పడేసింది. గాఫ్ డిఫెన్స్‌తో వ్యూహం మార్చిన సబలెంక.. ఎక్కువగా గ్రౌండ్ షాట్లు, ఓవర్‌హెడ్ స్మాష్‌లపై దృష్టి నిలిపింది. ఆరంభంలోనే రెండు సార్లు సబలెంక సర్వ్‌ను బ్రేక్ చేసిన గాఫ్ 3-1తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అదే జోరులో 6-3తో రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. టైటిల్ పోరును నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. డిసైడర్‌లో సమవుజ్జీలుగా నిలిచిన తరుణంలో.. 11 గేముల్లో ఏకంగా తొమ్మిది నెగ్గిన గాఫ్ 4-0తో తిరుగులేని ఆధిక్యం దక్కించుకుంది. గాఫ్ జోరుకు అడ్డుకట్ట వేయటంలో సబలెంక తేలిపోయింది. దీంతో 6-2తో మూడోసెట్‌ను కొకో గాఫ్ సొంతం చేసుకుంది.



ఓపెనర్ల మెరుపులు

రోహిత్, గిల్ అర్ధ సెంచరీలు
వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం
నేడు కొనసాగనున్న భారత్ - పాక్ పోరు



కొలంబో : భారత్, పాకిస్థాన్ పోరుకు వరుణుడు మళ్లీ అడ్డు తగిలాడు. ఆసియా కప్ సూపర్ 4 దశలో భారత్, పాక్ తలపడగా.. ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. భారత్ ఇన్నింగ్స్‌లో 24.1 ఓవర్ల సమయంలో వర్షం రంగ ప్రవేశం చేసింది. పలుమార్లు ఫీల్డ్ అంపైర్లు పిచ్‌ను తనిఖీ చేసినా.. ఆదివారం మ్యాచ్ జరిగే అవకాశాలు కనిపించలేదు. దీంతో అంపైర్లు మ్యాచ్‌ను రిజర్వ్ డేకు వాయిదా వేశారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు పున ప్రారంభం కానున్న భారత్, పాక్.. యథాతథంగా భారత ఇన్నింగ్స్‌లో 24.1 ఓవర్ల నుంచి ఆరంభం కానుంది. భారత్, పాక్ గ్రూప్ దశ మ్యాచ్ వర్షార్పణమైన సంగతి తెలిసిందే.

గిల్, రోహిత్ దూకుడు : పేసర్లకు అనుకూలించే పరిస్థితుల్లో తొలుత బ్యాటింగ్‌కు వచ్చిన భారత్‌కు ఓపెనర్లు అదిరే ఆరంభం అందించారు. కెప్టెన్ రోహిత్ శర్మ (56, 49 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (58, 52 బంతుల్లో 10 ఫోర్లు) అర్ధ సెంచరీలతో మెరిశారు. కొత్త బంతితో పాక్ పేస్ త్రయం షహీన్, రవూఫ్, నసీం నిప్పులు చెరిగినా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వారి భరతం పట్టాడు. పవర్‌ప్లేలో బౌండరీల మోత మోగించిన గిల్ వేగంగా పరుగు లు పిండుకున్నాడు. మరో ఎండ్‌లో రోహిత్ శర్మ నెమ్మదిగా ఆడాడు. పది ఫోర్లతో దండెత్తిన గిల్ 35 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. పేసర్లపై గిల్ విరుచుకుపడగా.. స్పిన్నర్లపై రోహిత్ దండెత్తాడు. షహీన్‌పై సిక్సర్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన రోహిత్.. షాదాబ్ ఖాన్‌పై రెండు సిక్సర్లు, ఓ ఫోర్‌తో జోరందుకున్నాడు. ఐదు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో 42 బంతుల్లోనే రోహిత్ అర్ధ సెంచరీ నమోదు చేశాడు. తొలి వికెట్‌కు ఓపెనర్లు 121 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి భారీ స్కోరుకు గట్టి పునాది వేశారు. స్వల్ప విరామంలో ఓపెనర్లు ఇద్దరు నిష్క్రమించగా.. విరాట్ కోహ్లి (8 నాటౌట్), కెఎల్ రాహుల్ (17 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచారు.

గుంటూరు టు గుజరాత్

- యథేచ్ఛగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

పేదలకు అందించాల్సిన రేషన్ బియ్యం యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయి. గుంటూరు కేంద్రంగా గుజరాత్‌కు రవాణా అవుతున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్సు అధికారులు నాలుగు రోజుల క్రితం స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో విజిలెన్సు, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఇటీవల కాలంలో తనిఖీలు ముమ్మరం చేసి రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుంటున్నారు. కార్డులపై సరఫరా చేయాల్సిన బియ్యం తమిళనాడు, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా ఎగుమతి అవుతున్నా పౌరసరఫరా శాఖ ప్రేక్షక పాత్ర పోషిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విజిలెన్సు ఉన్నతాధికారుల సూచనల మేరకు జిల్లా అధికారులు నిఘా పెట్టి రేషన్ బియ్యం నిల్వ కేంద్రాలపై దాడులు చేస్తున్నారు. వినియోగదారులకు అందాల్సిన రేషన్‌ను కొంతమంది అక్రమార్కులు ఇతర రాష్ట్రాలకు తరలించి కిలో రూ.30 నుంచి రూ.40కు చొప్పున అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గుంటూరు నుంచి కాకినాడ, కృష్ణపట్నం ఓడరేవు ద్వారా ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యం తరలిపోతుండగా ఇప్పటికే పలుమార్లు పోలీసులు, విజిలెన్సు అధికారులు వేర్వేరుగా వీటిని స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. రేషన్ బియ్యం పంపిణీలో గత కొన్నేళ్లుగా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. ఇంటింటికీ రేషన్ పథకం అమలు చేస్తున్నా ఈ అక్రమాలు ఆగడం లేదు. రేషన్ మాఫియా కొంతమందిని ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని వివిధ మార్గాల్లో బియ్యం సేకరిస్తోంది. గత నెల రోజుల కాలంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విజిలెన్సు అధికారులు దాదాపు 200 టన్నుల వరకు రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్సు అధికారులకు సమాచారం వచ్చి పట్టుకున్న సరుకు ఈ స్థాయిలో ఉండగా గుట్టుచప్పుడు కాకుండా వేలాది టన్నుల బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోతుంది. రేషన్ బియ్యాన్ని రైస్ మిల్లర్లు కిలో రూ.20కు కొనుగోలు చేసి పాలిష్ పట్టి సాధారణ రకం, సోనామసూరిలో కలిపి విక్రయిస్తున్నారు. ఇటీవల బియ్యం ధరలు భారీగా పెరగడం వల్ల తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి కిలో రూ.44 నుంచి రూ.48 మధ్య విక్రయించే సోనామసూరి రకాల్లో కలిపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. క్వింటాలుకు పది కిలోల రేషన్ బియ్యం కలిపినా తెలుసుకోని పరిస్థితి ఉంది. ఎక్కువగా రేషన్ బియ్యం కలిపిన మిల్లు యజమానులకు, వినియోగదారులకు మధ్య వివాదాలు ఏర్పడుతున్నాయి.



పల్నాడు జిల్లా అమరావతి మండలంలోని ధరణికోటలో పట్టుబడిన రేషన్ బియ్యం వద్ద విజిలెన్స్ అధికారులు



టిటిడి బోర్డు సభ్యుడిగా కృష్ణమూర్తి వైద్యనాథన్ ప్రమాణం

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులుగా కృష్ణమూర్తి వైద్యనాథన్ ఆదివారం తిరుమల శ్రీవారి ఆలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. స్వామివారి సన్నిధిలో టిటిడి జెఇఒ వీరబ్రహ్మం వీరి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68